# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక


**శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా**

ఫోన్ (0863) 2293645, 2293862, 2293280, 2293206, 9299656267

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com



సంపాదక వర్గము

గూడూరి వెంకట రత్నం

డి.జె. బాలకృష్ణ లాల్

డా॥ఎస్. రామతారక పరబ్రహ్మ శాస్త్రి

మిస్. పి. ఇందిరాదేవి

డా॥ యమ్. స్వర్ణముఖి



సంపుటి 33 సంచిక 11

పేజీలు 40

జులై 2014

**5సం॥ల చందా రూ. 250**

**2సం॥ల చందా రూ. 120**

**సంవత్సర చందా రూ. 60**

**విడిప్రతి వెల...... రూ. 5**

బ్యాంక్ డ్రాఫ్ట్ A/C Y.S.C.K.P.M

చారిటబుల్ ట్రస్ట్ పేరుతో డ్రా చేయండి.

M.O, బ్యాంక్ డ్రాఫ్ట్ పంపవలసిన చిరునామా

మేనేజరు

సమర్థ సద్గురు మాగజైన్

శ్రీకాళీగార్డెన్స్ - 522508

printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL


**ఈ సంచికలో** ........................ ....... **పేజీ**


భద్రవాక్యం ........................................2

శ్రీబాబూజీ ఉవాచ................................3

అమ్మమాట..........................................5

సన్నిధిలో సంభాషణ ..............................7

యోగవాశిష్ఠము ..................................9

శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు......................11

స్థిత ప్రజ్ఞుడు ......................................12

సాధన ..............................................14

పరిప్రశ్నేన సేవయా.............................15

శరణార్థులమన్నామూ- చరితార్థులమైనాము.........16

ధ్యానం - మాధవ స్థితి...........................17

శ్రీకృష్ణకర్ణామృతము.............................19

ఏకత్వదృష్టి .......................................21

బ్రహ్మానంద స్థితి..................................23

సర్వేశ్వర శతక కర్త

యథావాక్కుల అన్నమయ్య.......................24

వ్యాస మహర్షి.......................................25

వేద జ్యోతి..........................................27

ఆశ్రమ పాఠశాల.....................................28

శ్రీ దత్తాత్రేయ-పరశురామ సంవాదం.........29

ముముక్షువు వెంకటరమణ ప్రసాద్ ..........31

సత్సంగామృతం.....................................33

ఉపమన్యుడు .......................................35

సమర్థ సద్గురునాధుని దివ్య చరిత్ర...........37

విష్ణు కథలు - సదాశివ బ్రహ్మేంద్రసరస్వతి....39

# భద్రవాక్యం

– పరాశర ప్రసాద్

దేహో దేవాలయ ప్రోక్తో జీవో దేవః సదాశివ ః।

త్యజేదజ్ఞాన నిర్మాల్యం సోఽహం బావేన పూజయేత్ ॥

(స్కందోపనిషత్)

'శరీర మాద్యం ఖలు ధర్మ సాధనమ్' అన్నట్లుగా ధర్మ సాధనకు , కర్మ ఆచరణకు దేహం అవసరం. దేహం వ్యవహారిక సత్యం. ప్రతి మానవుడు దేహాన్ని దేవాలయంగాను, అందులోని జీవుణ్ణి సదా శివుడుగాను భావన చేస్తూ, అజ్ఞానమనే నిర్మాల్యాన్ని తొలగించుకుంటే సోఽహమనే భావనే మిగులుతుంది.



జీవులంతా తత్వతః ఒక్కటే సుమా! భేదభావమే అజ్ఞానం. కుండలు వేరైనా అందున్న ఆకాశం మాత్రం వేరుకాదు. దానికి వైవిధ్యం లేదు. ఈ అనుభవమే సర్వజీవ సమ భావానికి మూల బీజం. వేదాంతంలో దేహం అనిత్యం, మిధ్య. కాని దేహం వ్యావహారికంగా సత్యంగా అంగీకరింప బడుతోంది. ఈ క్రింది శంకరుల శ్లోకం నిత్యజీవితంలో సర్వ కర్మలూ, సర్వేశ్వరారాధనా రూపంగా చేసే సాధనకు ప్రతీక.

ఆత్మాత్వం, గిరిజామతిః, పూజాతే విషయోపభోగ రచనా, నిద్రాసమాధి స్థితిః।

సంచారఃపదయోః ప్రదక్షిణ విధిః స్తోత్రాణి సర్వాగిరః।

యద్యద్ కర్మ కరోమి తత్తదఖిలం శంభో తవారాధనమ్।

మానవుడు తన దైనందిన జీవితాన్ని భగవదారాధనగా, కర్మను కర్మ యోగంగా మలచుకోవాలి. దేహాన్ని దేవాలయంగాను, జీవుని శివుని గాను, కర్మను ఆరాధనగానూ భావించి సాధించి తరించేవారికి మరేశాస్త్ర విజ్ఞానం అవసరం లేదు. వేదాంత సారాన్ని నిత్య జీవితంలో అనుభవంగా ప్రవహింప జేసుకోవటమే కర్మయోగ జ్ఞానము.

# శ్రీ బాబూజీ ఉవాచ

- పరాశర ప్రసాద్

శ్రీ బాబూజీ మహరాజ్ కపిలేశ్వరపురం గోదావరి స్నానాలకి తీసుకువెళ్తూ గోదావరి గట్టు మీద నుంచి నడిచి వెళ్తుంటే అక్కడ ఉన్న పుర్రెలు, ఎముకలను చూపించి భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ "చూశారా ఈ ఎముకలు ఎవరివో? ఏ వ్యక్తివో కదా! చైతన్యముతో కూడి ఉన్నప్పుడు ఈ వ్యక్తి ఎన్నో ప్రగల్భాలు పల్కి వుంటాడు. ఎంతో హుషారుగా తిరిగి వుంటాడు. ఏవేవో సాధించాలని ఆరాటపడి ఉంటాడు. ఇప్పుడు ఆ వ్యక్తి లేడు కదా! ఈ ఎముకలు ఇక్కడ ఇలా పడి వున్నాయి. ఇది మానవ జీవిత పర్యవసానము" అన్నారు.



శ్రీ బాబూజీ మహరాజ్ ఇంకా మాట్లాడుతూ "భగవంతుని కృపకు పాత్రుడు కాని జీవుడు అంత్యకాలంలో చెందే వ్యధ చాలా దుర్భరమైనది. మరణ వేదన గురించి మీకు చెబితే హడలిచస్తారు. అందువలననే అంత్యకాలంలో భగవన్నామస్మరణ ఎవరు చేస్తారో వారికి జన్మ రాహిత్యం కల్గుతుంది. కాని మీ మనస్సు అంత్యకాలంలో భగవన్నామముపై నిలబడాలికదా! అలా నిలబడేందుకే సద్గురు మూర్తిని ఆశ్రయించి, ఆయన శిక్షణలో సాధన చేయటం తప్పనిసరికదా! సద్గురు మూర్తిని ఆశ్రయించిన వారికి మృత్యుభయం ఉండదు. మహాత్ములు చేసిన బోధని పెడచెవిన పెట్టి మృత్యువాత పడిన జీవులు మరణ వేదనే కాకుండా సూక్ష్మ శరీరంతో పొందే వ్యధను గూర్చి మహాత్ములు పరితపించి వారిని ఉద్ధరించటానికి తమ తపోశక్తినంతా ధారపోస్తారు.

మహాత్ముల గురించి మీకు ఏం తెలుసు? నేను జన్మకి వచ్చినందుకు ఒక్కరిని ఉద్ధరించగల్గినా చాలు నా జన్మ సార్థకమవుతుంది. మహాత్ములు ఈ దేహాన్ని పాము తన కుబుసాన్ని విడిచినట్లు సునాయాసంగా విడిచిపెడతారు. వారికి మరణం అంటే భయంగాని, మరణ వేదన గాని ఉండవు. వారు స్వచ్ఛందంగా దేహాన్ని త్యాగం చేస్తారు. జన్మించిన వాడు మరణించక తప్పదు. అందువలన జన్మరాహిత్యాన్ని

పొందాలి. జన్మరాహిత్యం పొందటానికి ఇక ప్రధాన అవరోధము దేహ భ్రాంతి. అది తొలగటానికి సద్గురు మూర్తిని ఆశ్రయించి సాధన చేయవలసిందే. నీ మనస్సు యొక్క ప్రవృత్తి రహితం అయ్యేవరకు సాధన కొనసాగించవలసినదే. మానవుడి హృదయం పవిత్రత చెందాలి. సద్గురు మూర్తి చేసే బోధ మనస్సులో మాలిన్యాన్ని తొలగించి ఆచరించటానికి తగిన స్ఫూర్తినిస్తుంది. అంతేకాదు కష్టాన్ని భరించటానికి శక్తిని కూడా అందజేస్తుంది. అంతకన్నా కావలసినది ఏముంది. కలియుగంలో మానవుడు దుష్కృత కర్మచేయనంతవరకు ఏ పాపము అంటదు.

మనస్సులో చెడు భావము కల్గినా భగవంతుడు క్షమిస్తాడు. సాధ్యమైనంత వరకు మంచినే ఆలోచించి. మంచినే చేయి అని అన్నారు. అందువలననే సద్గురుమూర్తి సాధకునికి పరీక్షపెడతాడు. దాని ద్వారా సాధన పటిష్టంగా ఉంటుంది. సాధకునికి నిర్వహించే పరీక్ష కేవలం శిక్షణకోసమే, శిక్షించటానికి కాదు. సాధకుడు ఇంతవరకు ఏమి సాధించామని నిరుత్సాహపడటం గాని మనము సద్గురుమూర్తిని వయస్సు మీరిన తర్వాత ఆశ్రయించామే అని పరితపించవద్దు. ఇప్పటినుంచి సాధన ప్రారంభించు గురుకృపని సాధించు" అన్నారు.

## విజ్ఞప్తి

ఆశ్రమంలో చాతుర్మాస దీక్షా కార్యక్రమంలో భాగంగా, 18-7-2014 నుండి 27-8-2014 వరకు 41 రోజులు, శ్రీ శ్రీనివాస రామానుజదాసు గారిచే మహాభారత పురాణ ప్రవచనం జరుగును. భక్త మహాశయులు అందరూ ఈ సదావకాశాన్ని సద్వినియోగ పరచుకో గలరని ఆశిస్తున్నాము.

# మూలాన్ని గుర్తించు

సాధనకు శ్రవణం చాల ముఖ్యమైనది అని చెబుతూ, శ్రీగురుదేవులు నాలుగు ఉపమానాలు చెప్పేవారు - 1. ఉప్పుబొమ్మ, 2. బట్ట, 3. బండరాయి, 4. ఇనుపముక్క.

1.ఉప్పుబొమ్మను నీటిలో వేసిన మరుక్షణమే నీటిలో కరిగిపోయి తద్రూపాన్ని చెందినట్లు, ఉత్తములైనవారు భగవత్తత్వాన్ని శ్రవణం చేసినంతనే వారి మనస్సు అందులో లీనమై తదాకారరూపం చెందుతుంది.

2. బట్ట. రెండవ రకం గుడ్డముక్క లాంటివారు. బట్టను నీటిలో ముంచితే అది నీటినంతనీ పీల్చుకుంటుంది. ఆ బట్టని మళ్ళీ పిండితే, ఆ నీరంతా బయటకు వచ్చేస్తుంది. అదే విధంగా కొందరు భగవద్విషయాన్ని చక్కగా శ్రవణం చేస్తారు; చేసిన దాన్ని తిరిగి యథాతథంగా యితరులకు చెప్పగలరు. వీరు మధ్యములు.

3. బండరాయి. మూడవ రకం వారు బండ రాయి అధములు. నీటిలో ఎన్ని యుగాలున్నా, దానిలోనికి ఒక్క నీటి బిందువు కూడా పీల్చబడనట్లు, అధముడయినవాడు  ఎన్నాళ్ళు భగవత్తత్వం విన్నా, వాడిలోనికి అది వెళ్ళదు.

4. ఇనుపముక్క. చివరి రకం వారు. అధమాధములు. ఇనుపముక్కను నీటిలో వేస్తే, అది తుప్పుపట్టి పాడవటమే కాక, చుట్టూ ఉన్న నీటిని కూడా కలుషితం చేసినట్లు, కొంతమంది సద్గోష్ఠి జరుగుతూ ఉంటే, అక్కడ కూర్చుని వాళ్ళు వినరు సరికదా, చుట్టూ ఉన్నవారితో కబుర్లు చెబుతూ వారిని కూడా పాడుచేస్తారు. వీరు అధమాధములు.

మహాత్ములు మనకి తానెవరో తాను తెలుసుకునేలా బోధ చేస్తారు. మూలాఽభావం ఇదమ్ జ్ఞాతమ్ శరీరం నాస్తి కేవలమ్ - అని బోధ చేస్తారు. మూలానికి వెడితే యిది అభావమే అని తెలుసుకున్న వాడికి శరీరభావమే ఉండదు అని మహావాక్యం. పూతనని సంహరించిన వాడు మనలోని రాక్షసత్వం వదలించటానికి ఎంత కష్ట పడుతున్నాడో!

'నేను మూలాధారమందే అనునిత్యం ఉన్నాను' అని గణపతి ఉపనిషత్‌లో 'మూలాధారస్థితోఽసి నిత్యమ్' అని ఆయన చెప్పుకున్నాడు.

ఆ గణపతి చిత్తచాంచల్యమనే ఎలుకను తన వాహనంగా చేసుకున్నాడు. ఆయన మన యింద్రియాలపై నృత్యం చేస్తూ, వాటిని తన అదుపులో పెడతాడు.

ఈవిధంగా, గురువులు మనని మూలానికి తీసుకువెడతారు. అసలు దోషం ఎక్కడుంది? ఒక్క బీజానికి ఎన్ని మొక్కలు వస్తున్నాయి? మర్రిబీజాన్ని తిన్న కాకి, రెట్టవేస్తే, ఆ రెట్ట మన యింటి గోడలోని బీటలో పడితే, నీరు తగిలేసరికి ఆ బీజం మొలకెత్తి వృక్షం అవుతుంది. ఆ మొక్కని పైనుంచి ఎంత కొట్టినా, తిరిగి మొలక వస్తూనే ఉంటుంది. దానివేళ్ళు అడుక్కి ఎంత లోతువెళ్ళాయో బయట నుంచి కొట్టేవాడికి తెలియదు. చిట్ట చివరకు ఆ వేళ్ళు ఆ గోడనే కూల్చివేస్తాయి. జడమైన ఒక గోడకే ఒక్క మర్రి విత్తనం వల్ల అంత ప్రమాదం సంభవిస్తే, ప్రాణం ఉన్న మనకి, మనసుల్లో ఎన్నెన్ని బీజాలు వస్తున్నాయో!

ఆ బీజాలని వేయించాలి. 'జ్ఞానాగ్ని దగ్ధ కర్మాణి' అని గీతాచార్యుడు చెబితే, 'ధ్యానాగ్ని దగ్ధ కర్మాణి' అని అస్మద్గురుదేవులు చెప్పారు. ధ్యానానికి ఆధారంగా నామాన్ని అందించారు. కాబట్టి 'నామాగ్ని దగ్ధ కర్మాణి' అని చెప్పుకోవచ్చు. యోగమంటేనే చిత్తవృత్తులను నిరోధించటం. ఈ మూలాన్ని గుర్తించటానికే మనకీ మానవజన్మని యిచ్చాడు భగవంతుడు. భగవంతుడు మనవాడై ఉన్నాడు; మనలోనే ఉన్నాడు; మనమే అయి ఉన్నాడు. ఇదే మూలం. దీనిని గుర్తించటానికి గురుదేవుడిచ్చిన లక్ష్యార్థమందు గురితప్పని నిజదృష్టి కలిగి ఉండాలి.

అట్టి దృష్టికి గురుతు నీ అనుభవమే. చెప్పుడు మాటలు వినటం వల్ల నీకు మిగిలేవి చెప్పుదెబ్బలే. కులశైలములు విరిగి మీదపడినా, సముద్రం పైకి పొంగివచ్చినా, నిజమైన భక్తుడు చలించడు. అట్టి భక్తుడిపై గురుదేవుల కృప సంపూర్ణంగా ఉంటుంది.

ఉప్పుబొమ్మ తన పుట్టుకకి కారణమైన కడలి యొక్క లోతును కనుగొనాలని వెళితే ఏమయింది? ఇది నా నిజస్థితికదా అని అందులోనే లీనమైపోయింది. అదే విధంగా ప్రతిసాధకుడూ పట్టుదలతో తన మూలాన్ని గుర్తించడానికి కావలసిన అఖండ భక్తి, జ్ఞాన, వైరాగ్యములను, అఖండ సాధనా సంపత్తిని ప్రసాదించి గురుపాదుకలు సర్వదా కాపాడుగాక! సుఖీభవ! సుఖీభవ!!

# సన్నిధిలో సంభాషణ

- పరాశర ప్రసాద్

17-12-1985

"భగవానుడు ఎక్కడ శయనిస్తాడు చెప్పండి చూద్దాం?" అని శ్రీ బాబు ప్రశ్నించి, "శేషతల్పము మీద అని మీరు సమాధానం చెప్తారేమో. కాదు మీలాగా dunlop పరుపుల మీద గాని కుషన్ బెడ్‌ల మీద గాని శయనించడు. అలా శయనిస్తే మీలాగానే ఆయనకి కూడా నడుము నొప్పులు, కాళ్ళ నొప్పులు మెడ నొప్పులు వచ్చేవి. అందుచేతనే ఆయనకు అటువంటి పరుపులు రుచికరించవు. ఆయన భక్తుల హృదయాల్లో శయనిస్తాడు. మీ హృదయాన్ని అహంకార మమకారాలతో, సంకల్పాలతో ఈర్ష్య, అసూయ, రాగద్వేషాలతో నింపుకుంటే అటువంటి



బండరాయి వంటి కఠిన హృదయంలో ఆయన ఎలా పవ్వళిస్తాడు? అందువలన మీ హృదయం దూదిలాగా మెత్తగా ప్రేమతో కూడి ఉంటే మీ హృదయాన్ని ఆయన వదలి ఉంటాడా?" అని అన్నారు.

"పరమాత్మని ఎవరైతే హృదయంలో నిలుపుకుంటారో వారికి మృత్యుభయం ఉండదు. పరమాత్ముడు కూడా భక్తుని వదలి ఉండ గలుగుతాడా? నిజమైన భక్తుడు అని ఎప్పుడు అనిపించుకుంటాడంటే భగవానుని దివ్య చరణారవిందాలను ఎన్ని ఇక్కట్లు వచ్చినా విడిచి పెట్టకుండా ఆశ్రయించినప్పుడు.

కోతి చూడండి. ఒక చెట్టు మీద నుంచి వేరొక చెట్టుమీదకి అక్కడ నుండి మరొక చెట్టు మీదకు దూకుతుంది. భగవంతుని దివ్య చరణారవిందాలను ఆశ్రయించినంత మాత్రాన సరిపోతుందా? మనస్సు నిలపాలి కదా! అలా మనస్సు భగవానుని యందు నిలిచిన వాడికి ఈ భవసాగరము దాటటానికి ఇబ్బంది ఏముంది? భవసాగరాన్ని దాటాలంటే కులగోత్రాలకు అతీతుడై ఉండాలి. ఎందువలన అంటే ధామత్వంలో కులగోత్రాలకు తావులేదు. హరి కులానికి చెందిన వాడు అంటే

భవబంధాలు హరింపబడ్డాయి అని అర్థం. వైకుంఠనాథుని గోత్రానికి చెందిన వాడి మనస్సు పరమాత్ముని యందు లగ్నమై ఉంటుంది. కాబట్టి అక్కడ గుణాలకి తావులేదు.

గురుచరణారవిందాలని ఆశ్రయించిన వాడి మనస్సుకి సంకల్పాలు అనే మబ్బు కమ్మినా ఆ మబ్బుల్ని చొచ్చుకొని పోయి వెళ్ళి గురుదేవుని ప్రేమ కిరణాలు వర్షించి ఆ మబ్బుల్ని తొలిగిస్తాయి. సూర్యకాంతిని అందుకోకుండా మబ్బులు అడ్డుకోగలవు గాని భక్తుడు గురుదేవుని కృపారసమనే కాంతి కిరణాలను అందుకోకుండా ఏ మబ్బు ఆపగలుగుతుంది చెప్పండి? చేయవలసినదల్లా నీ మనస్సుని గురుచరణార విందములు, లేక భగవానుని దివ్య చరణారవిందముపై నిలపటం. అప్పుడు ఇక బాధ్యత అంతా ఆ భగవానుడిదే.

కోతి పిల్ల తన తల్లి పొట్టని అంటిపెట్టుకొని గట్టిగా తన హస్తములతో పట్టుకొని ఉంటుంది. తల్లికోతి ఒక చెట్టు మీద నుండి మరొక చెట్టు మీదకి దూకినపుడు పిల్లకోతి తల్లికోతిని గట్టిగా పట్టుకోవాలి. అలా పట్టుకుంటే పిల్లకోతికి భయమేముంది? జ్ఞాని పరిస్థితి అటువంటిది.

**అవతార మూర్తి శరీరాలు పుణ్యపాప కర్మలతో ఏర్పడినవి కావు. వారిది కర్మ జన్మ కాదు. లీలా జన్మ.**

**పుణ్యాత్ముల పుణ్య ప్రభావం, పాపాత్ముల పాప ప్రభావంతో అవతార శరీరం వస్తుంది. కాబట్టి ఆ శరీరం ద్వారా పుణ్యాత్ములకు సుఖము, పాపాత్ములకు దుఃఖము లభిస్తుంది.**

**ప్రహ్లాదుని పుణ్యము, హిరణ్యకశిపుని పాపమూ చేరి నరసింహస్వామిగా అవతరించటం సంభవించినది.**

-డా॥ వి.వి.ఆర్ ప్రసాద్ రావు

# యోగవాశిష్ఠము

-సుషుమ్న ప్రసాద

"ఈజగత్తంతా మనసుచే సృజింపబడ్డది. మనసు లేక మాయ కంటే గొప్ప మాంత్రికుడు లేక యింద్రజాలికుడు మరొకడు లేడు. ఈకథలో మనసు లేక మాయయే సిద్ధుడిగా గోచరించాడు. మనసే మాయ. మనసు మాయ యొక్క పనిముట్టు. లవణ మహారాజు యొక్క అనుభవాలు, కోరికలు, ఆరాటం, ప్రాపంచిక విషయాలకు బానిసలయిన మానవులయొక్క బాధాకరమైన స్థితికి ప్రతిబింబము.



ఈమాయా జనితమైన జగత్తంతా భగవంతుని సర్వ సమర్ధతకు, అపారమైన శక్తికి నిదర్శనము మాత్రమే. ఈప్రపంచము లోని జీవులంతా మాయతో మోసపోతున్నారు. వారు అసత్యమైన విషయ పరంపరను సత్యంగా నమ్ముతారు. సత్యము, నిత్యమూ అసత్యము, అనిత్యముగా భ్రమచెందుతారు. వృక్షమెలాగ తన కొమ్మలతో, రెమ్మలతో విస్తృతమౌతుందో, అలాగే మనసు తన ఊహతో సృజింప బడిన వాటితో విస్తృత మవుతుంది.

మనసుకు చక్కని క్రమశిక్షణ యిచ్చి, మనోజనితమైన ఊహలను, సంకల్పాలను నిర్మూలం చేయాలి, వివేచనాశక్తి విచారణ, వైరాగ్యము, క్రమబద్ధమైన ఆత్మధ్యానము వలన యెవరైతే మనసును అదుపులో ఉంచుకొంటారో, వారు మాయా ప్రభావమునకు లోను కారు. అప్పుడు నీవు అమృతత్వస్థితిని పొంది, అవధులు లేని నిత్యానందమును పొందుతావు " అని వశిష్ఠ మహర్షి ముగించారు.

## స్థితి ప్రకరణము

వశిష్ఠమహర్షి శ్రీ రామచంద్రునికిలా ప్రబోధించారు. "ఓ రఘువీరా! మనసే అన్నింటికి మూలకారణము. మనము చేసే కర్మలు (క్రియిలు) మనసే ఆధారము. మనసనే దయ్యాన్ని అదుపులో పెట్టి, మన అధీనంలో ఉంచుకోవాలంటే, బాహ్యా ప్రపంచముపై విముఖతతో,

సంకల్పాలన్నిటినీ అణిచివేయాలి. సూర్యకిరణాలు సూర్యునిలో యిమిడి వున్నట్లు, ప్రపంచము మనస్సులో నిబిడీకృతమై ఉన్నది. ఈ ప్రపంచాలన్నిటికీ మనసే రిజర్వాయర్ లాంటిది. జగత్తు మనసుకంటే భిన్నమైనదికాదు మనస్సు, జగత్తు, అత్యంత సన్నిహితమై, అవినాభావ సంబంధము కలిగివున్నవి. ఈ జగత్తంతా మనస్సు యొక్క లీల (క్రీడ) మాత్రమే. ఈ జగత్తంతా స్మృతిపథం పైనే ప్రకాశిస్తున్నది.

చిత్రకారుడు తెర, బ్రష్షు మున్నగు పరికరముల సహాయమేమి లేకుండానే యీ జగత్తనే చిత్రములో పరిణితమైన చిదాకాశముపై చిత్రీకరింపబడ్డది. ఈ చిత్రము తనంతట తానే వ్యక్తీకరింపబడుతూ, తన్ను తానే దర్శించుకొంటూ వుంటుంది. ఈ జగత్తు జాగ్రదవస్థలో సుదీర్ఘమైన స్వప్నములాంటిది. ఈ జగత్తు యొక్క ప్రతిబింబము సర్వవ్యాపకము, అవిభాజ్యము, అఖండము, సంపూర్ణము, స్వయంప్రకాశమైన బ్రహ్మము నిశ్శబ్ద సాక్షి ఇది అద్దములోని బ్రహ్మము యొక్క ప్రతిబింబము లాంటిది. ఈ ప్రపంచము పరబ్రహ్మ వలనే ప్రకాశిస్తున్నది. బ్రహ్మమే యీ విశ్వాన్నంతటికీ మూలాధారము. కారణమునకు, ఫలితమునకే విధమైన సంబంధములేదు.

-సశేషం

**హింసాహింసా తీర్మానం కర్మనిబట్టి కాక, భావాన్నిబట్టి ఏర్పడింది.**

**గృహదహనం చేసిన వాణ్ణి 'ఆకతాయి' అని నిందిస్తాము. ఆంజనేయుడు లంకానగరాన్ని దహనం చేశాడు. అయినా ఆయన మన పాలిటి 'దేవుడు'.**

**ఎక్కడుంది కీలకం? శ్రీకృష్ణుడు 18 అక్షౌహిణుల సైన్యం నాశనం చేయించి కూడా అహింసామూర్తే!**

**ఈ 'జగత్తు' అనే విరాట్‌పురుష శరీరంలో 'కౌరవులు' అనే 'పుండు'కు ఆపరేషన్ చేయక తప్పనిసరై ఆ మహత్కార్యాన్ని నిర్వహించిన 'భిషగ్వరుడు' శ్రీకృష్ణుడు.**

-డా॥ వి.వి.ఆర్ ప్రసాద్ రావు

# శ్రీ కాళీ గార్డెన్స్ కార్యక్రమాలు

జులై 2014

8 మంగళ : తొలి ఏకాదశి, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన

12 శని : ఆషాఢ పూర్ణిమ, సత్సంగం, సద్గురుపాదపూజ, భక్తసమారాధన, చాతుర్మాస్య దీక్ష ప్రారంభం.

17 గురు : కర్కాటక సంక్రమణం దక్షిణాయనం ప్రారంభం.

21 సోమ : శ్రీగురుదశమి, సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ.

25 శుక్ర : మాసశివరాత్రి.

26 శని : అమావాస్య.

ఆగస్ట్ 2014

8 శుక్ర : శ్రావణ శుక్రవారం, వరలక్ష్మీవ్రతం

10 ఆది : రాఖీపూర్ణిమ శ్రీసద్గురు పాదపూజ, భక్త సమారాధన

17 ఆది : శ్రీకృష్ణాష్టమి సందర్భంగా మూడు రోజులు శ్రీకృష్ణాష్టమి వేడుకలు జరుగుతాయి.

20 బుధ : శ్రీగురుదశమి, సత్సంగం, శ్రీ సద్గురు పాద పూజ.

23 శని : శనిత్రయోదశి. మాస శివరాత్రి.

25 సోమ : అమావాస్య

29 శుక్ర : వినాయక చవితి తె.జా 5గం.30ని॥ శ్రీసద్గురుపాదపూజ, ఉదయం 11గం. సాముహిక విఘ్నేశ్వర పూజలు, భక్త సమారాధన.

**తననూ, సారథినీ రక్షించుకుంటూ, పదివేల మంది వీరులతో యుద్ధం చేయగల సమర్థుణ్ణి 'మహారథుడు' అంటారు.**

# స్థిత ప్రజ్ఞుడు

- కామేశ్వరీ ప్రసాద

ఒక చక్కటి ఆశ్రమంలో, తీర్చి దిద్దిన వనంలో, ప్రశాంత వాతావరణంలో, ఏకాంతంగా కూర్చుని సనత్కుమార మహర్షి తపస్సు చేస్తున్నారు. ఆ సమయంలో పార్వతీ పరమేశ్వరులు వ్యాహ్యాళికి బయలు దేరారు. వారు మహర్షి తపస్సు చేసుకునే చోటుకు వచ్చి నిలబడ్డారు.



మహర్షి వారిని వచ్చినట్లుగా కూడా గుర్తించ లేదు. ఏ మాత్రమూ చలించక అలాగే తీవ్రమైన తపస్సులో మునిగిపోయి ఉన్నారు. అది చూసి పార్వతీ దేవి శంకరునితో 'చూశారా! ప్రభూ! మనం వచ్చి యింతసేపైనా కూడా అతను మనల్ని అనాదరణ చేస్తున్నాడు' అన్నది. దానికి శంకరుడు "లేదు పార్వతీ! అతడు నా పరమ భక్తుడు. నిరంతరం నా యందే మనస్సు నిల్పి ధ్యానిస్తాడు. నాకు చాలా ప్రీతిపాత్రుడు" అన్నాడు. 'అయితే నేను అతన్ని పరీక్షిస్తాను' అన్నది జగన్మాత. "తప్పక పరీక్షించు దేవి" అన్నాడు శంకరుడు.

'కుమారా! నీకు మేమంటే అంత నిర్లక్ష్యమా! నీవు తక్షణమే అశ్వ శాలలో అశ్వములు కాచేవాడివిగా జన్మించు!' అని శపించింది. వెంటనే ఆ మహర్షి అలాగే జన్మించి, గుఱ్ఱములను కాస్తూ ఉన్నాడు. కొంత కాలానికి జగజ్జనని ప్రత్యక్షమై 'ఏం కుమారా? ఇప్పుడు ఎలా ఉంది నీ తపస్సు?' అని ప్రశ్నించింది. అతను వినయంగా "జననీ! నీకు నమస్కారము. బ్రాహ్మణుడిగా ఉన్నప్పుడు స్నాన సంధ్యాదులతో కొంత కాలం వృథా అయ్యేది. ఇప్పుడు నాకు ఆ కాలం కూడా తపస్సుతో గడచి పోతోంది. ఎంతో సంతోషంగా ఉంది" అన్నాడు.

వెంటనే పార్వతీ దేవి 'తక్షణమే ఎడారిలో తిరిగే ఒంటెగా జన్మించు' అని శాపమిచ్చింది. వెంటనే ఆ గుర్రాల కాపరి ఎడారిలో ఒంటెగా పుట్టాడు. అలా ఎడారులలో కాలక్షేపం చేస్తూ, సదా తన మనస్సును పరమాత్మయందు నిలిపి ఆనందంతో ఉన్నాడు.

కొంతకాలం తరువాత మరల దేవి ప్రత్యక్షమై 'కుమారా! ఇప్పుడెలా ఉంది? పాపం ఎన్ని కష్టాలు పడుతున్నావో?' అని అడిగింది. దానికి ఆ

ఒంటె సమాధానం చెబుతూ "నేను క్రిందకి వంగలేను కదా! అందుకని పైనే నాకు మేత నీరు అందిస్తున్నారు. వేరే ఏ ఆలోచన లేక ఎల్లవేళలా ఊర్ధ్వ రేతస్కుడనై, ఆ సదాశివునే దర్శిస్తూ, ఆస్వాదిస్తున్నాను తల్లీ! నీవు ఎంతటి దయామయివి! నీకు నేను ఎప్పుడూ కృతజ్ఞుడనే" అన్నది ఆ ఒంటె రూపంలో ఉన్న మహర్షి.

వెంటనే పరమేశ్వరుడు కూడా ప్రత్యక్షమై "దేవీ! నేను చెప్పాను కదా! అతడు నా భక్తుడని. నీవు ఎన్ని పరీక్షలు పెట్టినా కూడా అతని మనస్సుకు చలనము లేదు. స్థితప్రజ్ఞుడు" అన్నాడు.

ఆ మహర్షి వారిరువురికి నమస్కరిస్తూ "నాలో ఏదో లోపం ఉంది కనుకే నన్ను యీ రకంగా తీర్చిదిద్దారు" వినయంగా అన్నారు.

కాబట్టి నిజమైన సాధకుడుకి సాధనలో ఎన్నడూ అశ్రద్ధ పనికి రాదు. గురుకృపను సాధించి తీరాలి సాధకుడు!

## ఈ భౌతిక శరీరము నీవు కాదు

**గ్రీసు దేశంలో ఎపిక్టిటస్ అనే వేదాంతి ఉండేవాడు. అతను బానిస అవడం చేత, చేసిన ప్రతీ చిన్న అపరాధానికి కఠినంగా శిక్షించేవారు రోమ్ అధికారులు. ప్రతీరోజూ అతనికి దెబ్బలు తినడం తప్పేది కాదు. పెద్దతప్పేమీ చేయక పోయినా యజమాని నిర్దయగా బాదటం వలన అతని కాలు విరిగి పోయింది.**

**స్నేహితుడు ఒకడు చాలా కాలానికి దూరం నుంచి వచ్చి చూసి, 'ఎలా కుంటివాడివి అయ్యావు?' అని అడిగాడు బాధగా. ఎపిక్టిటస్ చాలా విలక్షణమైన జవాబిచ్చాడు.**

**'నేను కుంటివాణ్ణి కాదు. నా కాలు మాత్రం కుంటిది' అని. అంటే బాహ్య శరీరానికీ, ఆత్మకు సంబంధం లేదనే స్థితికి అతను చేరుకున్నాడు.**

\- రామదాసు

# సాధన

- సుంకర వెంకట లక్ష్మీకాంత్

మనషిలో దైవత్వం జనించాలంటే సాధన మొట్టమదటి అడుగు. ఆ సాధన సవ్యంగా సాగాలి అంటే సాధకుడికి ఓర్పు, క్షమ అనే రెండు ముఖ్య ఆయుధాలు అవసరం. నియమ, నిబంధనలు పాటిస్తూ, బుద్ధిని జాగరూకతలో ఉంచి, ప్రయాణం సాగించాలి. గురువు ప్రసాదించిన మంత్రాన్ని మనస్సులో ధ్యానిస్తూ, సంసారంలో ఉంటూనే తన నిజ గమ్యం వైపు అడుగులు వేయాలి.

ఆ ప్రయాణంలో చేసే ప్రతి క్రియపైన మనస్సు పెట్టి చేయాలి. ఆడంబరాలకు, గ్రుడ్డిగా చేసే ఆచారాలకు దూరంగా ఉండాలి. ఒక పనిని పనిగా భావిస్తే, అంటే మనస్సు లేకుండా చేస్తే అది ఒక క్రియలాగే వుంటుంది. దాని ఫలితం కూడా నామమాత్రంగానే ఉంటుంది. గొప్ప క్రీడాకారులు తమ ఆటను ఆటగా చూడరు. ఆటే తమ జీవితంగా మలచుకుంటారు. అలాంటివారే విశ్వవిజేతలుగా నిలుస్తారు. అదే విధంగా సాధకుడు తన సాధనను యాంత్రికంగా చూడకుండా, సాధనే తన ప్రాణంగా మలచినప్పుడే సాధన ఫలిస్తుంది. అలాంటి సాధకుడు వేషం మీద, భాష మీద, ఆడంబరాలమీద దృష్టి పెట్టడు. ఇదే విషయాన్ని మనకు యోగి వేమన ఈ పద్యంలో వివరిస్తారు.....

పొడవు గల్గు జడలు పులితోలు భూతియు
కక్ష పాలలు పది లక్షలైన
మోత చేటె కాని మోక్షంబు లేదయా
విశ్వదాభి రామ వినుర వేమ!

పొడవైన జడలు, గడ్డము, మీసములు, గోళ్ళు, రుద్రాక్ష మాలలు, పెద్ద సంచి, పులితోలు యిలాంటివాటితో వేషధారియై, శివ భక్తుడిగా నటించు వారికి, అవి అన్నియు మోతచేటు అని, మోక్షహేతువు కావని హెచ్చరిస్తున్నారు.

ధర్మంగా జీవిస్తూ, సాధన చేస్తూ, జ్ఞానంగా జీవించటమే సాధన యొక్క గమ్యం!

# పరి ప్రశ్నేన సేవయా

– పరాశర ప్రసాద్

'జ్ఞానం వినా మోక్షం న లభ్యతే' అన్నది అందరికీ తెలిసిన విషయమే. జ్ఞానం పొందటానికి విచారణ కావాలి. విచారణ చేయటానికి గురుబోధ శ్రవణం చేయవలసినదే. శ్రవణం చేసినది తప్పక మననానికి వస్తుంది. అందువలనే సద్గురుదేవులు గురుబోధ శ్రవణం చేయమని హెచ్చరించేవారు. శ్రవణం చేయాలంటే ఆసక్తి ఉండాలి కదా. ఆ ఆసక్తిని కలిగించేది గురుదేవులే. బోధను వినిపించేదీ ఆయనే! తత్వవిచారణకి ఆసక్తి కలగాలంటే 'గురోరంఘ్రి పద్మే మనశ్చే నలగ్నం తతఃకిమ్, తతఃకిమ్' అన్నది గుర్తుంచుకోవాలి. అయితే కర్మ చేసేది మనస్సే. కర్మ ఫలాన్ని ఆర్జించేది, అనుభవించేది కూడా మనస్సే. దేహానికి యింద్రియాలకి ఏ బాధా లేదు. ఉపాధికి పునరావృత్తి లేదు. పునరావృత్తి మనస్సుకే. అందువలన



సాధన ద్వారా మనస్సు నిర్మలం కావాలి. స్థిరపడాలి. ఏకాగ్రతను సాధించాలి.

ఏకాగ్రతను సాధించటానికి ధ్యానానికి కూర్చుంటే, మనస్సు ఆత్మలో లయమవటానికి బదులుగా, నిదురలోకి జారుకుంటుంది. నిదురలోకి మనస్సు జారకుండా ప్రయత్నిస్తే, ప్రాపంచిక విషయాదుల విచారణలోపడి విక్షేపం చెందవచ్చు. పూర్వపు వాసనలచేత ప్రాపంచిక విషయాదులతో అనుభవించినవి జ్ఞప్తికి వస్తాయి. నిదుర అవరోధం కాకపోయినా, విక్షేపం అవరోధమవుతుంది.

అంతేకాదు, మనసు కొందరు సాధకులకు సంకల్ప వికల్పాలకు గురిఅయి వికలమవుతుంది. పోనీ, సాధకుని మనసు కొంచెం స్థిరపడి ఏ కొంచెం ఆనందం దొరికినా, తాను ఏదో సాధించానని ఆనందపడి పోయి, అదే గమ్యమని భావించి, దానినే నెమరు వేసుకుంటూ ముందుకు కొనసాగకపోవటము అవరోధమే కదా! యోగి ఎన్నడూ అలా చేయడు. గాలి తగలని దీపము ఎలా దేదీప్యమానంగా ప్రకాశిస్తుందో, అలా ఆయన మనసు ఏ విధమైన అవరోధాలకు లొంగక నిలకడగా నిలబడుతుంది. నీ మనస్సుతో నీ అంతరాంతరాలకు చొచ్చుకు పోయి శోధించి, వెదకగా వెదకగా అచింత్యం, అవ్యక్తం, అదృష్టం, అవ్యవహార్యంగా భావించే ఆత్మవస్తువులో లయించి, నేనుగా అనుభవించ గలుగుతుంది. అది నీ యదార్థ స్థితి. దానిని గుర్తించిన వాడు జ్ఞాని. అదే మోక్ష స్థితి. ' అని శ్రీగురుదేవులు తెలియజేశారు.

# శరణార్థులమన్నామూ - చరితార్థులమైనాము

-పెనుమాక నాగేశ్వర రావు

శరణార్థుల మన్నామూ చరితార్థులమైనాము
మీ
శరణార్థుల మన్నామూ చరితార్థులమైనాము
హారము వేశాము, మల్లెల హారము వేశాము
హారతులిచ్చేము మంగళ హారతులిచ్చాము
హాయిగ ఉన్నాము మేము హాయిగ ఉన్నాము ॥శరణా॥

గానము చేశాము, మీ గుణగానము చేశాము
పూజలు చేశాము, మీ పదపూజలు చేశాము
ధన్యులమైనామూ మేము ధన్యత చెందాము
హాయిగ ఉన్నాము మేము హాయిగ ఉన్నాము ॥శరణా॥

దాసులమన్నాము, దాసాను దాసులమన్నాము
దాసోఽహమన్నాము దాసదాసోఽహమన్నాము
దీవెనెలొందాము మీ దివ్య దీవెనలొందాము
హాయిగ ఉన్నాము మేము హాయిగ ఉన్నాము ॥శరణా॥



# ధ్యానం - మాధవ స్థితి (1)

- రేఖ

(ఏప్రిల్ 12వ తేదీ నుండి 18వ తేదీ వరకు స్పెయిన్ దేశానికి చెందిన బార్సిలోనా నగర సమీపంలో గల సిల్స్ అనే ఊరిలో వారం రోజులపాటు జరిగిన సత్సంగ సమావేశాలలో 'ధ్యానం' అనే విషయంపై శ్రీ మాతాజీవారి ఉద్బోధన ఈ సంచిక నుండి ధారావాహికంగా ప్రచురిస్తున్నాము.)

ధ్యానమూలం గురోర్మూర్తిః। పూజామూలం గురోఃపదమ్।
మంత్ర మూలం గురోర్వాక్యమ్ ।ముక్తి మూలం గురోఃకృపా ॥

అన్న గురుగీత మంత్రంతో శ్రీమాతాజీవారు తమ బోధను ప్రారంభించారు. ప్రపంచంలో మానవుడు ఎన్నో పనులను, పరులు మెచ్చుకోవాలనో, కీర్తి ప్రతిష్ఠలకోసమో చేస్తుంటాడు. కానీ తన ఆధ్యాత్మిక అభివృద్ధి కోసం తనకు తాను ఎంత చేసుకుంటున్నాడు?

నిజంగా మెచ్చుకునేవాడు, మంచి చేసేవాడు, ఆపదలో ఆదుకునే వాడు భగవంతుడొక్కడే. మానవుడు తన జీవితం తనకి ఎంత సౌందర్యాన్ని, అందాన్ని, శాంతిని యిస్తోందని అవలోకన చేయాలి. బాహ్య సౌందర్యంలో శాంతి లేదు. అది చిరకాలం నిలిచేది కాదు. మనో సౌందర్యం కావాలి. దాని వెనుక ఉన్న బుద్ధి ప్రకాశించాలి. శ్రీశంకర భగవత్పాదులవారు, శ్రీరామకృష్ణ పరమహంస, జ్ఞానదేవ్, నామదేవ్, గౌతమబుద్ధునివంటి మహాత్ములు ఆ విధంగా ప్రకాశించారు.

వేదాంతంలో ఒక ఉపమానం ద్వారా తత్వం బోధిస్తారు. ఇక్కడ ఒక ఖాళీ స్థలం ఉంది. ఆ ఖాళీ స్థలంలో పునాదులు వేసి, గోడలు కట్టి సీలింగ్ వేసి, ఒక మఠాన్ని నిర్మించారు. ఖాళీ అంటే ఆకాశం. మహాకాశం సర్వత్ర వ్యాపించి ఉంటుంది. దానిలో ఒక మఠ నిర్మాణం అయ్యేసరికి అందులోని ఖాళీస్థలం మఠాకాశమయింది.

అలాగే భగవంతుడనే అనంత శక్తి సర్వత్రా వ్యాపించి ఉంది. మన తల్లిదండ్రులు ఆ అనంత శక్తిలో నుంచి వచ్చినవారే. వారి పెళ్ళి మనం చూడలేదు. అంటే యీ ఘటం, యీ ఉపాధి యింకా అప్పటికి తయారవలేదు. సర్వసృష్టి ఆ అనంతశక్తిలో నుంచి వచ్చినదే. మనం యీ సృష్టిలోని వారము. ఆ అనంత తత్వంలోని వారమే. ఈ దేహమే మన యిల్లు. ఇందులో కూడా ఖాళీ ఉంది. శ్రీగురుదేవులు దానిని సుఖ ప్రారబ్ధ గ్రహచార బండి అనేవారు.

మనస్సు ఇంద్రియాల ద్వారా సమస్త దృశ్య ప్రపంచాన్ని అనుభవింప జేస్తున్నది. మనలో ఉన్న ఆ అనంత శక్తి భగవంతుడు. కానీ కర్తృత్వ భోక్తృత్వాలు మీద వేసుకుని మనవే చేస్తున్నామని అనుకుంటున్నాము. కనురెప్పలు వేయటం, శ్వాస పీల్చటం, యింకా మన శరీరంలో జరిగే ఎన్నో క్రియలు మనవల్లే జరుగుతున్నాయా? నిమిషానికి ఎన్ని సార్లు శ్వాస పీలున్స్తున్నామనిగాని, లేక ఎన్నిసార్లు రెప్పవేస్తున్నామనిగాని మనం లెక్కపెట్టుకోవటానికి ఉపక్రమిస్తే, నాభి దగ్గరో లేక కడుపులోనో నొప్పి పుట్టటం, కంటికి రెప్ప చేరువైనట్లు అనిపించటం, లేకపోతే మనసు ఆ నిమిషకాలం ఎప్పుడవుతుందా అని ఆలోచన మనస్సులో మొదలవుతుంది.

ఈ అనంత శక్తిని తెలుసుకునేది ఎలా? మానవుడిలో ఉన్న ఆ అనంత శక్తిని వెలికితీసి, జీవిత గమ్యస్థానం చేరేది ఎలా? మానవ జీవిత లక్ష్యం ఏది? దాన్ని సాధించే విధానమేది? తన నిజ స్థితిని మానవుడు ఎలా గుర్తిస్తాడు? నిజమైన తనదైన శాంతిని పొందేది ఎలా? ఇటువంటి ప్రశ్నలకు ఏకైక సమాధనము 'ధ్యానము'.

<u>ధ్యానం అంటే ఏమిటి? అది ఎందుకు చేయాలి?</u>

తన సహజ స్థితిని, నిజస్థితిని తెలుసుకోవాలనుకునేవారికి, వారి గమ్యస్థానాన్ని చూపించే మార్గం ధ్యానం. ధ్యానం మనకంటె భిన్నంగా లేదు. మనం చేసే ప్రతి పనీ ధ్యానంతో కూడి ఉన్నది. ఏకాగ్రతతో ఏపనైనా చేయటమే ధ్యానం. ఉదాహరణకి కారు డ్రైవ్ చేసేవారు మనసుపెట్టి చేయకపోతే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. తనని తాను అంటే తన ఉనికిని తాను గుర్తించటానికి చేసే ఒక ప్రక్రియే ధ్యానం. క్రమశిక్షణ కోసం ఒకే ఆసనంలో కూర్చుని ధ్యానం చేయాలి. ఏ విధంగా కూర్చుంటే శరీరం కదలకుండా ఒకే ఆసనంలో (పొజిషన్‌లో) కొంతసేపు ఉండగలదో ఆ ఆసనంలో ధ్యానానికి కూర్చోవాలి. దీనినే ఆసన శుద్ధి అంటారు. అంటే ఒకే ఆసనంలో కనీసం రెండు గంటలపాటు స్థిరంగా ఉండి, ధ్యానం చేయగలిగితే ఆసనశుద్ధి లభించినట్లే. శ్రీగురుదేవులు కూర్చుని చేసుకోవటానికి వీలులేని వారికి గోవిందాసనం అని శెలవిచ్చారు. అంటే పడుకుని రెండు చేతులు జోడించి పైకి చాపుకుని ఉంచి, అలా కదలకుండా ఒకే ఆసనంలో ఉండటం.

-సశేషం

# శ్రీకృష్ణ కర్ణామృతము

- సుశీలా ప్రసాద

33. పర్యాచితామృత రసాని పదార్థభఙ్గీ
వలూని వల్గిత విశాల లోచనాని
బాల్యాదికాని మద పల్లవ భావితాని
భావేలుధన్తి సుదృశం తవ జల్పితాని ॥

తాత్పర్యము - అతా తేనె ఒలుకుచున్నదియు, శబ్దారుల సందర్భములచేత మనోహరమైనవి, త్రిప్పబడిన వెడద కన్నులు కలవియు, బాల్యమునకు మీరినవియు, మత్తులగు గోపకుల చేతలబడి నవియగు నీ యొక్క పలుకులు నీ ప్రియూరాండ్రైన గొల్లకాంతుల యొక్క చిత్తమున వెలగుచున్నవి.



సంధ్యవేళ యమునా నదికి నీళ్ళు తెచ్చుకోవటానికి వెడుతున్నాను. రచ్చబండ దగ్గర ఉన్న చింత చెట్టు దగ్గర నిలబడి ఎవరితోనో ఊసులాడుతూ కనులవిందుగా కనిపించాడు కన్నయ్య. బయలుదేరిన వేళ మంచిదయి నా పంట పండింది అనుకున్నాను. వెడల్పాటి కన్నులు అన్నివైపులా తిప్పుతూ కన్నయ్య నా వంక కూడా అరక్షణం చూశాడనిపించింది. అక్కడే నిలబడితే బాగోదు, ఎవరైనా పెద్దవాళ్ళు చూస్తే అభాండాలు వేస్తారు. అందుకని మనస్సును అక్కడే వదిలేసి, నదికి శరీరాన్ని నడిపించాను. నీళ్ళు ముంచుకొచ్చేసరికి లేడక్కడ. చింతచిగురు నల్లనయ్య నిలబడ్డందుకు కాబోలు మురిసిపోతూ ఎర్రబడ్డాయి. చప్పున గుప్పెడు చిగురుకోసి యింటికి తెచ్చాను. మనస్సు నిండా కన్నయ్య. తెల్లవారింది. గోవుల్నీ గోప బాలుడ్నీ మళ్ళీ తనివితీరా చూసి వాడి ఆలోచనలన్నీ కూడా వాడి ముద్దుల రూపంలో నింపేసుకుని పనులు చేసుకుంటున్నాను.

సూరీడు బద్ధకంగా సాగిపోతున్నట్లు అనిపిస్తోంది. కన్నయ్యని చూడాలని ఒకటే ఆవేదన. గుండెల్లో గుబులుగా ఉంది. ఎప్పటికి సాయంకాలం అయ్యేను? అడవుల నుండి చిట్టి తండ్రి ఎప్పటికి తిరిగి వచ్చేను? చింతచిగురు పచ్చడి చేశాను. పెరటిలోకి వెడితే ఎండలో నా నీడ నాతో సమానంగా ఉంది. ఈపాటికి కన్నయ్య చల్దులు ఆరగిస్తూ

ఉంటాడా? గోప బాలకులతో ఎకసెక్కాలాడుతూ ముద్దలు తింటూ వారికి తినిపిస్తూ ఉంటాడా? మనసాగట్లేదు. ఉండబుద్ధి కాక గుబుక్కున లేచాను. పిడతలో పచ్చడి, కుండలో అన్నం, దుత్తలో నెయ్యి బాగావేసి, ఆకులో కలిపి చిరిగి పోకుండా భద్రంగా ఆకులో వేసి బయటకి వచ్చి వీధితలుపు గడియపెట్టి చకచకా నడిచాను.

కనుచూపు వరకు కన్నయ్య గోవులు తోలుకు వెళ్ళేటప్పుడు చూస్తాను. కాని ఆపైన ఎటు వెళ్ళతాడో తెలియదు. దారి చూపేందుకు ఉన్నాడుగా నమ్మినవాడు. వాడే తోడనుకుంటూ అడుగులు వేశాను. కొంచెం దూరం వెళ్ళాక ఆవుల కాలిగిట్టల గుర్తులు, ఆ వెనుక చాలా పాదాల మధ్య చిన్ని అడుగుల చిన్నెలు కొట్టవచ్చినట్లు కనిపించాయి. పరమానందం అయింది. ఒంగి పాదాల ముద్రలను ముద్దుపెట్టుకున్నాను. పెదాలకు మట్టి అంటుకుంది. అది అమృతంలా ఉంది. అవే పట్టుకుని ముందుకు నడచాను. తీరా అడవిలోకి వెళ్ళాక దారి కనబడటం లేదు. పొడవాటి చెట్లు, అల్లిబిల్లిగా అల్లుకున్న పూలపొదలు పూలుకాసే మానులతో దోవంతా నిండి ఉన్నాయి. సందేహిస్తూ నిలబడ్డా.

కొద్ది దూరంలో చెట్ల నీడన గోవుల మందలు కనిపించాయి. ముందుకు నడవమని హెచ్చరిస్తున్నట్లు సన్నని బాట కనిపించింది. అది యమునా నది చెంతకు చేర్చింది. అక్కడ గోపబాలురంతా కాళ్ళు చేతులు కడుక్కుంటూ కనిపించారు. వాళ్ళ ముఖాలు ఆనందంతో వెలిగి పోతున్నాయి. ఎంత ధన్యాత్ములో వాళ్ళు! ఒక ప్రక్కగా నిలబడి వాళ్ళు అనుకునే మాటలు విన్నాను.

'ఒరేయ్! పోతిగా యీరోజు మన కిట్టయ్య ఎంత బాగా ఆడించాడో మరచిపోలేం కదరా' అన్నాడు ఒకడు. దానికి బదులుగా పోతిగాడు 'రాజు సేవకుల ఆట అన్నిటికంటే గొప్పగా ఉందికదురా' అన్నాడు. మనందరం తీగల పూలతో అల్లిన కిరీటం పెట్టుకుని, మన కిట్టయ్య ఆకులుపూలు అన్నింటిని గుట్టగా పోసి గద్దెలాగా చేస్తే దానిమీద కూర్చుని' ఇంకోడు పట్టలేక 'వారెవ్వ! రాజుల్లోకెల్ల రాజులాగ ఉన్నాడు' అని సంబరంగా అరిచాడు. ఇంకోడు 'రాజులా ఉండటమేమిటి? నిజంగా రాజే మన కిట్టయ్య. అన్నట్లు మనమందరం తన మాట బోటు చేయకుండా వినాలి. అప్పుడే మనకు సుఖం. వినకపోతే బాధలే'.

-సశేషం

# ఏకత్వ దృష్టి

- కె.వి.

సత్యము, అహింస ఈ మతానికి రెండు మహోజ్జ్వల సూత్రాలు. సూర్య భగవానుడు అందరికీ తన కిరణాలు సమంగా పంచిపెట్టి, సకల జీవరాసులను పోషిస్తాడు. ఆయనకు ఏ ఒక్కరిపట్ల పక్షపాతం లేదు. అందరినీ పుణ్య గంగానది తన పవిత్ర జలంతో పాప ప్రక్షాళన చేస్తుంది. కుష్ఠురోగిని కూడా అది పరిశుద్ధం చేసి, అతనికి సుఖశాంతులనిస్తుంది. అయితే ఆ రోగి స్పర్శవల్ల నది ఏమీ కలుషితం కాదు.

ఆ నది పవిత్రత ఎటువంటిదంటే, దానికి అసలు కాలుష్యం వుండదు. హిందూమతం కూడా అట్లే పరిశుద్ధం చేసే మతం. మనలోని కాలుష్యాలను పరిశుద్ధం చేసి, మనలో దివ్య పరిణామాన్ని తీసుకుని రాగల శక్తి యీ మతానికి ఉన్న ఉత్కృష్ట లక్షణం. అయితే మనం కావలసినది దాన్ని సక్రమంగా వినియోగించటం.



సత్యం గొప్పదనం మనం ముందు గుర్తించాలి. సత్యంగా జీవించగల చిత్తశుద్ధి మనలో ఉండాలి. మిగిలినవన్నీ వాటంతట అవే సిద్ధిస్తాయి. మంచి చెడు, సుగుణం దుర్గుణం మధ్య తేడా మనకి తెలిసేలా చేస్తుంది. సర్వశక్తిమంతుడు, పరమ దయామయుడైన ఆ పరమాత్ముని శరణాగతి పొందటం ఎలాగో అది నీకు తెలుపుతుంది.

మీకు యిష్టమైన దైవ నామం ఎదో ఒకటి ఎన్నుకోండి. ఏ పేరైనా ఒకటే. నామాలన్నీ ఆయనవే. ఆయన నామం నిత్యం స్మరించ వచ్చు. సర్వకాల సర్వావస్థలయందు ఆయన నామాన్ని గానం చేయ వచ్చు. ఏదో నిర్ణీత వేళల్లోనే ఆయనను గుర్తుంచుకోవాలనీ, ఆలపించాలనీ అనుకోవద్దు. నీ మనశ్శరీరాలతో ఆయన నామం కలుషితం కాదు. పైగా అన్ని కలుషితాలను తొలగించగల శక్తి ఆయన నామానికి ఉంది. ఆయన దివ్య నామంలో శరణాగతి పొందండి. ఆయన నామ మహాత్మ్యం ఏమిటో మీరే గ్రహించండి.

తమ ఇళ్లల్లో జనన, మరణాలు సంభవించినప్పుడు ఆ ఇంట్లో మయిల ఉంటుందని హిందువులలో ఒక నమ్మకం ఉంది. ఆధునిక కాలంలో మతం ఆరాధన వంటివి నిషిద్ధం. కానీ భగవానుడు యీ కాలుష్యాలన్నిటికీ అతీతుడు. ఎవరైనా బాధలలో ఉంటే శాంతి కోసం భగవానుని స్మరించకూడదా?

భగవానునిలాగే ఆయన నామం, స్మరణ, గానం కాలుష్యాలకు అతీతం. సర్వకాల సర్వావస్థలయందు భగవన్నామాన్ని స్మరించ వచ్చు. అన్ని ఆశలు అడుగంటినప్పుడు, నిరాశాంధకారము ఆవరించినప్పుడు, మనతోపాటు చిరకాలం ఉండే ఒక ఆశారేఖ! భగవానునిపై విశ్వాసం! ఆయన నామ స్మరణ!

మొదటి నుంచీ అటువంటి విశ్వాసాన్ని అందరూ పెంపొందించు కోవాలి. జీవితంలోని ప్రథమ దశలోనే యిట్టి విశ్వాసాన్ని కలిగి ఉన్న వారికి ఎటువంటి వేదన ఎప్పటికీ కలుగదు.

భగవంతునిలో విశ్వాసంతో పాటు మనం, అందరియెడల సుహృద్భావాన్ని కూడా పెంపొందించుకోవాలి. ఇదే హిందూ ధర్మ సారం!

ఒక గుడ్డివాడు రోడ్డు మీద నడుస్తుంటే ఒకతను అతన్ని చూసి యింటికి భోజనానికి పిలవాలనుకున్నాడు. "నువ్వు రేపు మా యింటికి భోజనానికి రా" అని చెప్పాడు. ఇంటికి వచ్చి భార్యతో "రేపు మనయింటికి ఒక గుడ్డివాడు భోజనానికి వస్తాడు. వంట చెయ్యి" అన్నాడు. 'ఒకరికి కాదు యిద్దరికి చేస్తాను వంట' అన్నదామె. "ఒకణ్ణి భోజనానికి పిలిస్తే యిద్దరికెందుకు చేయటం వంట?" అని అడిగాడు. దానికి సమాధానంగా 'గుడ్డివాడు ఒక్కడే రాలేడు కదా! ఎవరోఒకరిని తోడు తెచ్చుకోవాలి కదా!' అన్నది.

ప్రపంచంలో సుఖమొక్కటే ఉండదు. సుఖంతో పాటు దుఃఖం కూడా ఖచ్చితంగా ఉండి తీరుతుందని దీని సారాంశం! అందుకే సుఖ దుఃఖాలకు అతీతులమై ఆత్మానందాన్ని అనుభవించాలి!

- రామదాసు

# బ్రహ్మానంద స్థితి

- రమణ ప్రసాద్

భీష్మ పితామహుడు శ్రీరామ రామ రామేతి అనే శ్లోకాన్ని అందించి, ఒకసారి 'రామ' అంటే అది సహస్రనామాలు చేస్తున్నట్లని తెలపిచ్చారు. మనం రాముడు, కృష్ణుడు యిలా అనేక నామాలు ఆశ్రయించి ధ్యానం చేస్తున్నాము. మన గమ్యం ఎమిటో ముందు తెలుసుకోవాలి. గురవే బ్రహ్మ విష్ణు మహేశ్వరులు. గురువే పరబ్రహ్మ అని గురుగీత చెబుతోంది. ఎప్పుడైతే గురుదేవుని గుర్తిస్తామో అందులోనే సకల దేవతలూ వచ్చేస్తున్నారు. అందుకే సూత్రధారి ఆయనే.

ఆనందం కేవలం పరమాత్మకు చెందినది. ఎక్కడ తృప్తి కలుగుతోంది అంటే కేవలం భగవదనుభూతితో మాత్రమే. ప్రాపంచిక సుఖాలకు హద్దులుంటాయి. భగవదనుభూతికి హద్దులు లేవు. కాళ్ళు నొప్పులుగా ఉంటే ప్రభూ! అనుకుంటే తృప్తి లభిస్తోంది.

విషయాల వల్ల వినాశం తప్పదని భగవద్గీతలో భగవానుడు హెచ్చరిక చేస్తున్నాడు...ధ్యాయతో విషయాన్ పుంసః సంగస్తేషూప జాయతే। సంగాత్ సంజాయతే కామః।కామాత్ క్రోధోభిజాయతే। క్రోధాత్ భవతి సమ్మోహః। సమ్మోహాత్ స్మృతి విభ్రమః। స్మృతిభ్రంశాత్ బుద్ధి నాశః ప్రణశ్యతి। - మనం వాసనలకు అలవాటు పడి సత్యాన్ని గుర్తించటం లేదు.. సత్యం దాచబడేది కాదు.

ఓమిత్యేకాక్షరం బ్రహ్మ వ్యాహరన్ మామనుస్మరన్
యః ప్రయాతి త్యజన్దేహం సయాతి పరమాం గతిమ్ ॥

'సర్వేంద్రియాలను నిగ్రహించి, మనస్సును హృదయ స్థానంలో నిలిపి, వశమైన మనస్సు ద్వారా పరమాత్మ ధ్యానమందు మగ్నుడై అక్షరబ్రహ్మ స్వరూపమైన ఓంకారాన్ని ఉచ్చరిస్తూ ఓంకారస్వరూపుడైన నన్ను చింతిస్తూ దేహ త్యాగం చేసినవాడు నన్నే పొందాతాడు' - అని భగవానుడు చెబుతున్నాడు.

ఆశను జయించాలంటే మితభాషణ, మితనిద్ర, మిత ఆహారం అలవాటు చేసుకోవాలి. మనస్సుకు సరుకు అందకపోతే నిర్విషయమై పోతుంది. ఏ విశ్వాసముతో గురుదేవులను ఆశ్రయించామో, అటువంటి ఉపాసన, విచారణ, తత్త్వదృష్టి బ్రహ్మానంద స్థితికి తప్పక చేరుస్తాయి.

# సర్వేశ్వర శతక కర్త యథావాక్కుల అన్నమయ్య

సేకరణ - సుశీలా ప్రసాద

అన్నమయ్య వీరశైవుడు, ఆత్రేయస గోత్రోద్భవుడు, యజుశాఖ అధ్యాయి, గోదావరి తీరవాసి, రాజేమహేంద్రవరం దగ్గర పట్టిస గ్రామంలోని వీరభద్రేశ్వర స్వామి అన్నమయ్య ఇలవేల్పు.

ఒకసారి అన్నమయ్య శ్రీశైలం వెళ్లి శ్రీమల్లికార్జుని దర్శించుకుని వస్తూ, దారిలో కృష్ణాతీరంలో జెట్టిపాలెం దగ్గర 'విశ్వామిత్ర' ఆశ్రమం దగ్గర ఉన్న సత్రంలో బస చేసి, అక్కడే 'సర్వేశ్వర శతకం' రచించాడు. ఒక్కొక్క పద్యం ఒక్కొక్క తాటాకు మీద వ్రాసి అది కృష్ణా నదిలో వేసి, ఎదురు వస్తే తీసి సూత్రంలో గుచ్చుతాను అని, రాకపోతే శిరస్సు ఖండించుకుంటాను అని ప్రతిజ్ఞ చేసి, గండకత్తెర ప్రక్కన పెట్టుకున్నాడు.

ఈ శతకంలోని 87వ పద్యం తిరిగి రాలేదు. శిరస్సు ఖండించుకోవటానికి ప్రయత్నం చేసేసరికి, ఒక పశువుల కాపరి తనకు ఒక తాటాకు దొరికిందని తెచ్చి యిచ్చి అదృశ్యుడయ్యాడు. అది సర్వేశ్వర కృపగా భావించి సూత్రంలో గుచ్చాడు.

87. తరులఁ బువ్వులు పిందెలై యొదవి తత్తజ్జాతితోఁబుడ్లగున్
హర మీపాదపయోజ పుజీతములై యత్యద్భుతం బవ్విరుల్
కరులౌ నశ్వములౌ ననర్ఘమణులౌఁ గర్పూరమౌ హారమౌఁ
దరుణీరత్నములౌఁ బటీరతరులౌ ఁతథ్యంబు సర్వేశ్వరా!

తాత్పర్యము -చెట్లకి పూసిన పూలు పిందెలై, పళ్ళుగా అవుతాయి. నీ పాదాలపై పెట్టిన పూలు భక్తుల కోర్కెలు తీర్చటానికి గుఱ్ఱాలు, ఏనుగులు, వెలలేని మణులు, అందాలనారీమణులు, హారాలు, కర్పూరము అత్యంత అద్భుతంగా మారతాయి కదా! సత్యమిది సర్వేశ్వరా!

# వ్యాస మహర్షి

- సుశీలా ప్రసాద

ఉపరిచర వసువు వీర్యంతో జన్మించిన వాసవి అనే పేరుగల కన్య సత్యవతిని తగిన పాత్రగా ఎంచురకున్న పరాశర మహర్షి యందు సజ్జో యవ్వనుడై జన్మించి దండ కమండలాలు, జటాధారియై లోకోద్ధరణ కార్యక్రమాన్ని చేపట్టిన వారు, వాసవి పరాశరుల నందనుడు వ్యాస భట్టారికుడు.

శక్తి హీనులు, ధైర్య శూన్యులు, మంద పుజ్ఞులు, అల్పాయుష్కులు, దుర్బలులు, దుఃఖార్ణవ మగ్నులు అయిపోతున్న జీవులకు సర్వాశ్రమ వర్గాలవారికి తప్పక మేలు చేయాలనే తపనతో వ్యాసుడు వేదాన్ని నాలుగు భాగాలుగా విభజించి తన ముఖ్య శిష్యులైన పైలునికి -ఋగ్వేదము, జైమినికి - సామవేదము, వైశంపాయునినికి - యజుర్వేదము, సుమంతునికి - అధర్వణవేదము పఠించమని ఆజ్ఞాపించారు.

గురుదేవుని ఆజ్ఞానుసారంగా వారు ఆ విధంగా వేదాలను వల్లెవేశారు. వ్యాసుడు మిగిలిన వారికి పంచమవేదమైన పురాణ ఇతిహాసాలు రచించి అవి అందుకోగల భాగ్యశాలి రోమహర్షణ సుతుడైన సూతునికి అందించాడు.

ఆ తరువాత బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య వర్గాల వారికి వేదాలు చదవటానికి వినటానికి అర్హత ఉంది కాని, శూద్రులు స్త్రీలు తదితర వర్గాలవారి కోసం తిరిగి రచన సాగించి మహాభారత కావ్యం రచించారు.

వేదార్థ భావం అంతా భారత మిష చేత యితరులైన వారందరికీ అన్ని ధర్మాలను అందించిన ముని హృదయంలో ఇంకా అసంతృప్తి మిగిలే ఉండగా, అన్నీ చేశాను కానీ, లోపల ఉన్న పరమాత్మ సంతోష పడినట్లు లేడు అని మథన పడుతుండగా, నారద మహర్షి వచ్చి, "భారత శృతి విధాతవు. వేదజనితమైన జ్ఞానమంతా కాచి వడబోసిన వాడివి. అరిషడ్ వర్గాలు జయించిన వాడివి. బ్రహ్మతత్వ వేత్తలలో అగ్రగణ్యుడివి అయిన నీ ముఖంలో విచారం కనపించటానికి కారణమేమిటి? పూజనీయమైన ధర్మాలు అన్నీ చెప్పావు. కానీ, అందులో ఏ కొంచెమైనా విష్ణు కథల గూర్చి చెప్పావా? ఎన్నెన్ని ధర్మాలు చెబితే మాత్రం హరి తన గుణగణ

విశేషాలు వర్ణించకపోతే హర్షిస్తాడా! హరిని వర్ణించక పోవటమే నీ దోషం. అందుకే నీకు యీ విచారం కలిగింది.

శ్రీహరిని వర్ణించిన కావ్యం ఎలా ఉంటుందో తెలుసా? బంగారు పద్మాలు, రాజ హంసల కాంతులు నిండిన మానస సరోవరంలా వెలుగుతుంది.

సర్వ పాపాలు పారద్రోలే హరినామ కీర్తన పాడుతూ, జపం చేస్తూ హరిని భావిస్తూ, తాపసులు ధన్యులవుతారు కదా! సత్యధర్మ ప్రియవాది అయిన ఓ మహానుభావా! అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడైన నారాయణుని వర్ణించి చెప్పు" అని హెచ్చరించాడు.

"వేదాలు వెయ్యి చదివినా ముక్తి పథాన్ని అందించ లేవు. భాగవతాన్ని పఠిస్తే ముక్తి పథం సుగమం అవుతుంది. ధీరులు, ఆత్మారాములు అయిన కారణరహితులైన యోగులు నారాయణుని భజిస్తారు. నారాయణుడు అట్టివాడు" అని వర్ణిస్తూ వ్యాసుడు శ్రీ భాగవత రచన చేశాడు.

అట్టి ఋషిపుంగవుడైన వ్యాసభగవానుని పరంగా ఏడాదిలో నాలుగు పూర్ణిమలను భక్త జనులు భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. అవి వరుసగా ఆషాఢ, కార్తీక, మాఘ, వైశాఖ పూర్ణిమలు. వీటినే గురు పూర్ణిమలు అంటారు.

## తొలి ఏకాదశి

ఆషాఢ శుద్ధ ఏకాదశినే తొలి ఏకాదశి అంటారు. ఈ రోజున శ్రీ మహావిష్ణువు క్షీర సాగర శయనుడవుతాడని అందుకే దీనిని శయన ఏకాదశి అని కూడా అంటారు. తిరిగి నాలుగు నెలల అనంతరం కార్తీక శుద్ధ ఏకాదశి క్షీరాబ్ది ఏకాదశినాడు విష్ణువు తిరిగి లేస్తాడని పురాణ కథనం. ఈ నాలుగు నెలలు చాతుర్మాస వ్రతంగా సాధుజనులు దీక్ష చేస్తారు. పండుగలన్నీ అప్పటి నుంచే ప్రారంభమవుతాయి వరుసగా. అందుకే దీనిని తొలిఏకాదశి అంటారు.

# వేద జ్యోతి

- వడూరు బాల జ్ఞానశేఖర్

పూజకు తగిన పుష్పం
పుణ్యమూర్తి మా బాబూజీ
వెలుగు నిచ్చు నా దీపం
వేద మూర్తి శ్రీ బాబూజీ ॥పూజకు॥

కోపము లోపము చంపినవారు
గుణమున గొప్పను పొందిన వారు
దైవ రూపము తెలిసినవారు
దైవమే తానైనవారు ॥పూజకు॥

మనసు చూసి గెల్చిన వారు
మనసులో సుఖియించినవారు
జనుల సుఖమే కోరినవారు
జాతి భేదము కూల్చినవారు ॥పూజకు॥

దీర్ఘ దర్శనం పొందినవారు
దివ్య తేజస్సు చెందినవారు
మమత నింపిన మహా తపస్వి
మాయ తెలిసిన మహనీయులువారు ॥పూజకు॥

కరుణా కటాక్షం కలిగినవారు
కాళీదేవి అంశమయ్యారు
జ్ఞానవిలాసం గాంచినవారు
నారాయణుడై శోభించువారు ॥పూజకు॥

(1985 డిసెంబర్ నెల మాసపత్రికలో ముద్రించబడినది)

# S.H.K.V.P.B. RESIDENTIAL SCHOOL

**(Recogd. by Govt. of A.P.)**

**Sri Kaligardens, Nambur-522508, Guntur Dt A.P,**
**Ph: 0863-2594211**


ఎమ్. ఫణీంద్ర


కె. లావణ్య


కె. ధీరజ్ కుమార్


ఎస్. కనకదుర్గ


కె. అంజలి


కె. సిద్ధార్థ


కె. శ్రీలత


ఎన్. అంజలి


పి. ప్రియాంక


పి.చిన్నబాబు

2014 సం॥ లో మా స్కూలుయందు 10వ తరగతిలో 500 మార్కులు పైన ఎ మరియు ఎ1 గ్రేడు యందు ఉత్తీర్ణులైన విద్యార్థినీ విద్యార్థులు

# శ్రీదత్తాత్రేయ పరశురామ సంవాదము

- పరాశర ప్రసాద్

దత్తగురువు పరశురామునికి బోధను కొనసాగిస్తూ, "చితి, త్రిపుర అనే భేదము లేకపోయినా, విచిత్ర రూపాలతో ప్రకాశిస్తున్నందు వలన వేరుగా భావించ బడుతున్నాయి. అద్దం ఒక్కటే అయినా ప్రతి బింబాలు వేరుగా కనబడుతున్నాయి కదా.



సుషుప్తిలో నిర్వికారంగా ఉన్న మనస్సు స్వప్నంలో ద్రష్ట, దృశ్యము, దర్శనములుగా భిన్నంగా కనబడుతున్నాయి కదా! ఆ త్రిపురయే చిత్ర, విచిత్ర ప్రపంచ రూపంగా భాసిస్తున్నది. రెండుగా కనిపించినంత మాత్రంచేత ద్వైతమనేది సత్యము కాదు. స్వప్నంలో చితి, చైత్యము రెండూ కనబడుతున్నాయి. చితి మాత్రమే ఉన్నదని, చైత్యము అసత్యమని అంటున్నాము. లోకంలో ప్రకాశము, ప్రకాశ్యము రెండూ ఉంటేనే వస్తువు గుర్తించ బడుతోంది.



అలాగని ప్రకాశము కన్న భిన్నంగా వస్తువు వుండాలి కనుక ద్వైతము అంగీకరించినట్లు కాదుకదా! లోకంలో కూడా ప్రకాశము లేకపోయినా ప్రకాశ్యము భాసించవచ్చు. ఎలాగంటే గ్రుడ్డివాడు చేతి స్పర్శతో వస్తువుని గుర్తించగల్గుతాడు. అంతేకాదు కళ్ళు మూసుకుని ధ్యానంలో ధ్యేయాన్ని భావన చేయగలుగుతున్నాడు కదా!

లోకంలో ప్రకాశ్య ప్రకాశకాల అవగాహనను అనుసరించి ద్వైతాన్ని అంగీకరించినట్లు కాదు. చితి విషయంలో పైదోషం వర్తించదు. శుద్ధ పరిపూర్ణ చిత్ ప్రకాశము లేనిదే దృశ్యము ఉండదు. అద్దము లేనిదే ప్రతిబింబము ఉండదు కదా!

మనసు ఉండేమాట నిజమే అయినా మనస్సు కూడ చితి చేత ప్రకాశింపబడేదే కాబట్టి, చితిలో మనస్సు అంతర్భూతమై ఉందన్నమాట. అద్దంలో ప్రతిబింబం యొక్క స్థితి కూడా అంతే కదా! అంటే మనస్సుకి

ఉనికి లేదన్నమాట. ఇంక ద్వైతానికి తావెక్కడిది? స్వప్నంలో మనస్సే ద్రష్ట దృశ్యము, దర్శనములుగా ఉన్నాయి.

జాగ్రదావస్థలో కూడా ఆ మనస్సే మూడు విధాలుగా భాసిస్తోంది. అయితే లోక వ్యవహారం అర్థం చేసుకోవటానికి మనస్సు అనేది ఒక కరణముగా కల్పన చేయబడింది. లోకంలో కరణము కార్యము భిన్నముగా భావించినా చిజ్జగత్తుల విషయంలో మాత్రము అది వర్తించదు.

కలలోని వస్తువులు కలలోనే వినియోగపడతాయి కలలోని గొడ్డలి కలలో వృక్షాన్ని నరకటానికే వినియోగిస్తాము. అయినా ఆ కల అసత్యమే కదా! స్వప్న జ్ఞానం అసత్యమైనట్లు జాగ్రదావస్థలోని లోకజ్ఞానం కూడా అసత్యమే.

స్వప్నంలో చెట్టు నరకటం అసత్యమైనప్పుడు, దానికి సాధనమైన గొడ్డలి కూడా ఆసత్యమే కదా. మరి లోకంలో జ్ఞానం అసత్యమైనప్పుడు దానికి సాధనమైన మనస్సు కూడా అసత్యమే కదా! దృశ్య ప్రపంచానికి కారణం అని మనం భావించే మనస్సు లేనట్లే కదా!. కార్యరూపమైన లోకము కరణరూపమైన మనస్సు లేదన్నమాట" అని దత్తాత్రేయుల వారు పరశురామునికి చెప్పారు.

-సశేషం

**బుద్ధ భగవానుడు ఒకసారి బౌద్ధమత ప్రచారానికి వెళ్ళాడు, బుద్ధుడంటే గిట్టని వ్యక్తి ఒకడు ఎదురై ఆయన్ను దూషించటం మొదలు పెట్టాడు, బుద్ధ భగవానుడు అతన్ని ఉద్దేశించి "సోదరా! నీవు ఏదైనా పండును ఒకరికిచ్చావు అనుకో. అతను స్వీకరించ లేదనుకో. అప్పుడది ఏమౌతుంది?" అని ప్రశ్నించాడు, దానికా వ్యక్తి 'అది మళ్ళీ నా వద్దకే వస్తుంది' అని సమాధానం చెప్పాడు,**

**"నీ విమర్శలు. దూషణలు కూడా నేను స్వీకరించటం లేదు" అన్నాడు బుద్ధ భగవానుడు,**

**ఆ వ్యక్తికి ఒక్కక్షణంలో మనస్సు మార్పువచ్చి బుద్ధుని పాదాలపై పడి క్షమించమని వేడుకున్నాడు,**

# ముముక్షువు వెంకట రమణ ప్రసాద్

- రమణ బాబు

'ఏదైనా ఒక గుణం నాకు అర్పించు' అన్నారు శ్రీ బాబు. నేను, 'బాబూ! కామ, క్రోధాలని అర్పించలేను. అలాగే లోభ, మోహ మదాదులను మీకు ఇవ్వలేను. కాని మాత్సర్యాన్ని మీకు సమర్పించుకొంటాను' అన్నాను. బాబు 'సరే' అన్నారు. అప్పటి నుండి మాత్సర్యాన్ని జయించాననే చెప్పాలి' అన్నారు శ్రీ ప్రసాదరావుగారు ఒక ప్రసంగంలో మాట్లాడుతూ.

దీనికి తార్కాణం ఒకటి చెబుతాను. 'సావనీర్లకీ', 'సమర్థ సద్గురు మాస పత్రికలకీ' శ్రీ ప్రసాదరావుగారు వ్యాసాలు వ్రాసి ఇచ్చేవారు. వాటిని అప్పట్లో ఎడిటర్ గారైన కీ.శే. మూర్తిగారు ఎడిట్ చేసి, ప్రసాదరావుగారి దగ్గరకు వెళ్ళి,' మీరు ఏమీ అనుకోనంటే ఒక మాట చెబుతాను. మీరు వ్రాసిన ఆర్టికల్స్‌లో(articles) నేను కరక్షన్స్ చేశాను' అన్నారు. ప్రసాదరావుగారు నవ్వుతూ,' దానిదేముందండీ! మీరు కరెక్షన్స్ చేయటం వల్ల అవి ఇంకా బాగుంటాయి' అన్నారు. ఇది సకల శాస్త్ర పారంగతులైన ప్రసాదరావుగారి సౌమ్యశీలతకు ఒక ఉదాహరణ మాత్రమే. శ్రీ బాబూజీ మహరాజ్‌ని ఆశ్రయించిన తరువాత వారిలో శాస్త్ర వాసన మచ్చుకైనా లేకుండా చేసుకున్నారు. లేకపోతే అంతటి పండితులు ఎవరైనా వారు వ్రాసిన వాటిని కరెక్ట్ చెయ్యటానికి ఒప్పుకోరు.



శ్రీబాబూజీ మహరాజ్ సన్నిధిలో వారు అష్టావధానం చేసి శ్రీబాబూజీవారిని అలరించారు. ఆయనకు గల ఈ ప్రజ్ఞా పాటవాలకు భక్తులందరూ ఆశ్చర్య పోయేవారు. వారు బహు ముఖ ప్రజ్ఞావంతులు. ఫ్లూట్ అద్భుతంగా వాయిస్తారు. నాటకాలు వ్రాస్తారు. మంచి నటకులు కూడ. ఒకసారి శ్రీబాబూజీ వారి సప్తాహాలలో శ్రీగురుదేవులపై హరికథ వ్రాసి వారే హరికథా గానం చేశారు

శ్రీబాబూజీతో వారి అనుభవాలు చెబుతుంటే, శ్రోతలకు కళ్లకు కట్టినట్లుగా, అప్పుడే వారు శ్రీబాబుతో మాట్లాడుతునట్లుగా అనుభూతి కలిగేది. వారు ప్రసంగం చేసేముందు టైమ్ లిమిట్ పెట్టి, ఈ లోపల

ముగించమంటే, వారు ఆ సమయానికి తమ ప్రసంగం ముగించేవారు. నేను,'సారీ సార్! సమయాభావం వల్ల అలా చెప్పాల్సి వచ్చింది' అంటే, వారు,'ఇదేముందండీ! ఇది అప్పడాల పిండిలాగా ఎంత సాగదీయాలో అంత సాగదీయవచ్చు. లేకపోతే దానిని కుదించవచ్చు' అనేవారు నవ్వుతూ.

" ఒక టూ మినిట్స్ మీతో ఇంటర్వ్యూ కావాలి సార్" అనేవారు నాతో. అది ఏదో సాధారణ విషయమై ఉండేది. కాని వారు నాతో కలిసి మాట్లాడాలనే అభిలాషతోనే అలా చేసేవారు.

ఇలా చెప్పుకుంటూపోతే, వారితో గడిపిన మధుర స్మృతులు ఎన్నో ఉన్నాయి.

వారు జీవనముక్తస్థితిని పొందిన జ్ఞాని. శ్రీరామాలయంలో వారు ధ్యానం చేసుకుంటుంటే, పైనించి ఫ్యాన్ వారి తలపై పడింది. పెద్ద దెబ్బలు తగలకుండా గురుదేవుల రక్షణ జరిగినందుకు మాకు ఎంతో సంభ్రమాశ్చర్యాలు కలిగాయి. ఎంతో సంతోషించాం. శ్రీప్రసాదరావుగారు, భార్యను ఇంట్లో ఉండమని చెప్పి, వారు ఒక్కరే హాస్పిటల్‌కి వచ్చి కట్టు కట్టించుకొన్నారు. తనకేమీ జరగనట్లుగా నవ్వుతూ జోక్స్ వేశారు. అదే విధంగా శ్రీశైలంలో శరీర త్యాగంచేసే ముందుకూడా వారు అల్లుడిగారితో స్కూటర్‌లో హాస్పిటల్‌కి వెళ్తూ, "ఇప్పుడే వచ్చేస్తాను" అని భార్యతో అన్నారు.

వారి పార్థివ శరీరాన్ని ఆశ్రమానికి తీసుకు వచ్చారు. శ్రీప్రసాదరావుగారు అంతిమ సమయంలో నాలుక బయట పెట్టి వున్నారు. అది చూసి,శ్రీమాతాజీ "వారు జీవనముక్తులు. శరీరాన్ని విడుస్తూ కూడా, ఇదేముంది?ఆఫ్టరాల్!(Afterall) అన్నట్లుగా నాలుక బయట పెట్టారు" అన్నారు.

శ్రీ వెంకటరమణ ప్రసాద్‌గారు, "ఇదిగో బాబూ! మీ సన్నిధికి వస్తున్నాను" అన్నట్లుగా శ్రీ గురుసాయుజ్యం పొందారు. ఇది వారికి శ్రీ గురుదేవులపైగల చెదరని విశ్వాసం, వారు చేసిన అకుంఠిత సాధనల ఫలితం! మనంకూడా వారు నడిచిన మార్గంలో నడిచి జీవనముక్త స్థితిని పొందటానికి పటిష్ఠ సాధన చేసి మన గమ్యమైన ముక్తి ధామాన్ని చేరుకొందాం!

(గత సంచిక తరువాయి)

# సత్సంగామృతం

- మురళీ

(శ్రీబాబూజీ మహరాజ్‌వారి రజతోత్సవ మహాపుణ్యారాధన మహోత్సవాలలో భాగంగా ది.27-11-2013 బుధవారంనాడు పూజ్యశ్రీ మాతాజీ అందించిన బోధామృతం సంక్షిప్తంగా)

గురుపాద తీర్థమును స్వీకరిస్తే జ్ఞానవిజ్ఞాన యోగానుభవం కలుగుతుంది. గురుసుప్రసాదంబు గొనకున్న కల్గునే ప్రతిలేని చిత్తో పరతి సుఖంబు! గురుతత్వమాత్మ కనుగొనకున్న కల్గునే...... వారి ముద్రలు మనస్సులో భద్రపరచుకుంటే ఎవరైనా దోచుకెళ్ళగలరా? ఆత్మదాన్ని చూరగొన్నది. కృష్ణుడు నాతో ఆడుకుంటున్నాడు. ఎవరు కాదంటారో చెప్పండి. కృష్ణుడు అందరితోటీ ఆడుకుంటున్నాడు. మనం నమ్మిన ఆ భగవంతునియందు మనస్సు నిలవబట్టే యిక్కడ యింత సేపు కూర్చోగలిగారు. మనం యిప్పుడు ఎక్కడ ఉన్నాము? పరమ పదంలో ఉన్నాము. ఈ కలికాలంలోనే పరమపదం వద్ద ఉన్నాము. అది నిరతిశయమైన పరమపదం. ఇక్కడి వరకు వచ్చాక మళ్ళా యింకొక స్వభావం ఉంటుందా?

వినయ భయభక్తులెదలోన పెనుగొనంగ అల చతుర్విధ శుశ్రూషలాచరించు కొనుచూ..... చతుర్విధ శుశ్రూషలు - స్థల శుశ్రూష, భావ శుశ్రూష, అంగ శుశ్రూష, ఆత్మ శుశ్రూష. అటువంటి భావన మనకు ఎప్పుడూ కలిగి ఉండాలని, ఆ నాలుగు సేవలలో పాల్గొనాలని, సాధుధర్మ సమ్మేళనం చేసుకున్నందుకు సాధు మహాత్ములు ఆశీస్సులు పుష్కలంగా పొందాలని, అటువంటి గురుదేవుల వాక్కు వలన మనస్సు, బుద్ధి, చిత్త, అహంకారాలు సత్యం, శాంతి, దయ, ప్రేమగా మారిపోవాలని, భగవంతుని ప్రేమ చూరగొంటూ అటువంటి శాశ్వత నిత్య జీవితాన్ని మనందరం పొందుదుము గాక!

ప్రతి గురుభక్తునికి స్వంతం. మనందరం దాచుకోగలిగినది గురుభక్తి. చాలా గోప్పమది. గురుదేవులు ఎవరికి సాటిరారు. అంటే అక్కడ ఏదైనా రెండోది ఉంటేకదా! నువ్వు రెండు అని తలచేది

ప్రపంచంలో మాట. ఒకటి దాటి రెండు అనేది ప్రపంచం అయితే ఆ రెండు అనేకం కూడా. అనేకం అయిఉంది. వ్యవహారం అది. కాబట్టి వ్యవహారానికి వెళితే నీకు గురుత్వం లభించదు. గురువుల దగ్గర వ్యవహారం కాదిది. వ్యక్తికాదిది. సమిష్ఠి.

గురుపూజ అంటే వ్యక్తి పూజకాదు. సమిష్ఠి పూజ. నీకు యిక్కడ అవకాశం యిచ్చినందుకు, వారి పాదాలకు పూజ చేసుకుంటున్నాం. కాని ఏ భావనతో మనం పూజ చేసుకుంటున్నాము? ఎందరెందరో తాపసోత్తములకు కూడా అలభ్యమైనది మనకు ప్రసాదించారు. మానవ జన్మ యివ్వటమే కాదు, మనలో ఏ అర్హత ఉందని మనలను అనుగ్రహించి ఆశ్రయమిచ్చారు? ఆశ్రయమివ్వటమే కాక, ఏ సమయానికి ఏది ఎలా అనుభవించాలి, ప్రపంచ పోకడలో వివేక దృష్టి ఎలా కలిగి ఉండాలి, ప్రపంచంలో మెలుగుతున్నప్పుడు నిత్యానిత్య వస్తు వివేకం, ఇహాముత్రార్థ ఫలభోగ విభాగం కలిగి ఉండాలి. అర్థం చెప్పకోవటం కాదు, ఎటువంటిది లభించినా తూష్ణీ భావంతో ఎంత పెద్దదైనా సరే ఉంటే ఉండుగాక, ప్రపంచంలో ఎన్నో ఉండుగాక, మనం మాత్రం ఎక్కడ ఉండాలో అక్కడే ఉండాలి. మనం ఏ పాదాన్ని ఆశ్రయించామో, ఆ పాదమే, ఆ పదమే మనకు ఎంతకావాలో అంత యిస్తుంది. కన్నతల్లి క్షీరాలను యివ్వగలను కదా అనుకుంటే చిన్న పిల్లవాడు ఎంత వరకు త్రాగగలుగుతాడు? తన కడుపులో ఖాళీ ఉన్నంతవరకే త్రాగగలుగుతాడు.

-సశేషం

శ్రీ కాళహస్తీశ్వరా! ఆహా నీకు గజచర్మము వస్త్రముగాను, ఆహారము కాలకూటముగాను, బ్రహ్మకపాలము చేతిలో గిన్నె కాగా, క్రూర సర్పములు కంఠాభరణములుగా ఉండగా కూడా ఆ నారాయణుడైన విష్ణువు తన మనస్సును నీ పాద పద్మముల యందు చేర్చి ధన్యుడు ఎట్లు అయినాడో కదా!

-శ్రీకాళ హస్తీశ్వర శతకము

# ఉపమన్యుడు

- కలువకొలను సదానంద

(1986 జనవరి సమర్థ సద్గురు మాసపత్రికలో ప్రచురింపబడినది)

పూర్వం వ్యాఘ్రపాదుడనే శివభక్తుడుండేవాడు. అతని కొడుకు ఉపమన్యుడు. పేదరికం వల్ల తల్లిదండ్రులు అతనికి మంచి తిండిపెట్ట లేకపోయారు. అతనికి వయస్సు మూడు సంవత్సరాలు.

ఒకసారి తల్లితో కలసి ఉపమన్యుడు మేనమామ యింటికి వెళ్ళాడు. వాళ్ళు బాగా సంపన్నులు కాబట్టి రకరకాల పిండివంటలు చేసి పెట్టారు. ప్రతిరోజూ ఆవుపాలు తెచ్చి యివ్వసాగారు.

వాడు యింటికి తిరిగి వచ్చాక, తల్లిపెట్టిన గంజి మెతుకులు ముట్టుకోక, ఆవుపాలు కావాలని అడిగాడు. అందుకామె "నాయనా! మనం పేదవాళ్ళం. మనకు ఆవుపాలు ఎక్కడి నుంచి వస్తాయి?" అన్నది.

"అయితే మనం ఎప్పుడూ పేదలుగానే ఉండిపోవాలా? సంపన్నులం కావాటానికి ఎందుకు ప్రయత్నించ కూడదు?" అన్నాడు ఉపమన్యుడు బుల్లిబుల్లి మాటలతో. తన కొడుకు అన్నమాటలు ఆమె వ్యాఘ్రపాదునితో చెప్పింది.

వ్యాఘ్రపాదుడు కొడుకుతో "నాయనా! నీకు సంపదలు కావాలంటే శివపూజ చెయ్యి. దైవానుగ్రహం లేకపోతే, సంపద ఉన్నా కూడా సౌఖ్యం ఉండదు" అని చెప్పి వాడికి పంచాక్షరీ మంత్రాన్ని ఉపదేశించాడు.

ఉపమన్యుడు హిమాలయాలకు వెళ్ళి శివుణ్ణి గురించి తపస్సు చేయసాగాడు. మరీచి మహర్షి చేత శాపగ్రస్తులైన కొందరు మునులు పిశాచులై తిరుగుతూ, ఉపమన్యు శివార్చన చేసే చోటుకి వచ్చారు. వాడి దీక్షకు విఘ్నం కలిగించాలని, ఆ పిశాచాలు చెట్ల కొమ్మలు పట్టుకుని ఊగుతూ, పిల్లి మొగ్గలు వేస్తూ, వికృతంగా కేకలు వేస్తూ నానా భీభత్సం చేయసాగాయి.

ఉపమన్యుడు ఎంత మాత్రం భయపడకుండా, బిగ్గరగా పంచాక్షరి జపించేసరికి, వారికి ఆ వికృత రూపాలు పోయి, యథా రూపాలు వచ్చాయి.

తరువాత కొంత సేపటికి మహాక్రూరుడైన బందిపోటు దొంగ

తాను దోచుకున్న అపారమైన సంపదతో గుఱ్ఱం మీద ఆ దారిన పోతూ ఉపమన్యుడి దగ్గర ఆగి, 'దేని కోసం నువ్విలా తపస్సు చేస్తున్నావు?' అని అడిగాడు.

"శివుణ్ణి మెప్పించి, ఐశ్వర్యం పొందాలనుకుంటున్నాను" అని సమాధానం చెప్పాడు ఉపమన్యుడు. అందుకు ఆ దొంగ బిగ్గరగా నవ్వుతూ 'ఇలా ముక్కు మూసుకు కూర్చుంటే ఐశ్వర్యం ఎలా వస్తుంది? ముష్టి ఎత్తుకు బ్రతికే శివుడు నీకేమి యివ్వగలడు? దారులు కొట్టి నేను ఎంత సొమ్ము సంపాదించానో చూడు! కావాలంటే యిదంతా నువ్వు తీసుకో. జపమూ తపమూ అంటూ కాలం వృథా చేసుకోక, యింటికి వెళ్ళి సుఖంగా ఉండు' అన్నాడు.

"నీ సొమ్ము నాకెందుకు? నీ దారిన నువ్వు వెళ్ళు. నా క్కావలసిందేదో ఆ దేవుడే వచ్చి యిస్తాడు నాకు" అన్నాడు ఉపమన్యు కోపంగా గర్జిస్తూ.



వెంటనే దొంగ మాయమై పార్వతీ పరమేశ్వరులు ప్రత్యక్షమై వాడి ముందు నిలబడ్డారు. ఉపమన్యుడి సంతోషానికి అవధులు లేవు. శివుడు వాణ్ణి పైకెత్తుకుని పార్వతికిచ్చి "వీడు నీ కొడుకు" అన్నాడు. పార్వతి వాణ్ణి ముద్దాడి, కడుపు నిండా పాలు పట్టి, "నాయనా! నీకు ఎన్ని వరాలు కావాలన్నా అడుగు యిస్తాను" అన్నది.

"తల్లీ! మీ యిద్దరినీ కళ్ళారా చూశాను. నీ దగ్గర పాలు తాగాను. ఇంతకన్నా నాకింకేమి కావాలి? నేను కోరుకున్నప్పుడల్లా మిమ్మల్ని చూడ గలిగేటట్లు వరం యివ్వండి నాకు" అన్నాడు ఉపమన్యుడు.

ఉపమన్యుడు కోరకపోయినా వాడి తల్లిదండ్రులకు సకల ఐశ్వర్యాలు సిద్ధించాయి.

# సమర్థ సద్గురు నాధుని దివ్య చరిత్ర

గత సంచిక తరువాయి

- విజయేశ్వరానంద ప్రసాద్

**శ్రీ లలితానంద సరస్వతి స్వామి (గురువుగారి)తో శ్రీబాబు**

శ్రీబాబు - మీరు లోపలే అనుకున్నారనుకోండి. నేను కూడా, నా గది లోపలనో, మీ మదిలోపలనో మొత్తానికి లోపలనే ఉన్నాను కనుక వినిపించింది. అందుకని చుక్కడు, చిక్కడు అని ఎవరి గురించి అనుకుంటున్నారో తెలుసుకోవాలని వచ్చాను.

గురువుగారు - నిజమేలెండి. లోపలనే ఉన్నా, ఎదురుగా ఉన్నా, చిక్కదలచుకోకపోతే చిక్కరు కదా!



శ్రీబాబు - తక్కిన తలచిక్కు వ్యాపారాలన్ని ప్రక్కన పెట్టి, ఆ చక్కనివానిపైనే మనస్సు నిలిపి, ఎక్కడ ఎప్పుడు ఎలా తలచుకున్నా - ఇదిగో -ఇలా చక్కగా వచ్చి ఎదుట నిలబడతాడు బాల కృష్ణుడు. అలా దర్శిస్తూనే ఆ పద్యం వ్రాశాడేమో పోతన మహాత్ముడు. (పోతనామాత్యుణ్ణి శ్రీబాబు పోతన మహాత్ముడు అనేవారు)

గురువుగారు - పోతనామాత్యుడు పరమ భాగవతోత్తముడు కనుక ఆయనకు ఆ దర్శన భాగ్యం అంత సులభంగా లభించింది.

శ్రీబాబు - మీకు మాత్రం ఏం తక్కువైంది? నమ్ముకున్న వారికి నమ్ముకున్నంత. ఇంతకూ పద్యాలు పాడుకోవటమేనా, మీకు ఆ లీలా మానుష మూర్తి అయిన బాలగోపాలుని చూడాలని ఉందా?

గురువుగారు - చూపిస్తే తప్పకుండా చూస్తా.

శ్రీబాబు - తీరా కనిపిస్తే, తులసీదాసుకు మల్లే మోసపోతారేమో?

గురువుగారు - మీరు నన్ను మోసపుచ్చ దలచుకోకపోతే, ఆ బాలకృష్ణుని రూపంలోనే కనిపించవచ్చు కదా!

శ్రీబాబు - అదేమిటండోయ్! మధ్యలో నేను మోసపుచ్చటమేమిటి? నేను బాలకృష్ణుణ్ణీ కాదు, మోసపుచ్చేవాణ్ణి అసలే కాదు. (అంతలో ఎవరో అటుగా రావటంతో ఆ సంభాషణ అంతటితో ఆగిపోయింది.)

మరునాటి ఉదయం గురువుగారు తమ పూజ ముగించుకుని ఇందిర గదిలోకి వచ్చేసరికి ఇందిర కనిపించలేదు. ఇల్లంతా వెదికినా

కనబడలేదు. శ్రీబాబు తమ గదిలో ధ్యానంలో ఉన్నారు. ప్రక్క భాగంలోనే ఉన్న చెల్లాయమ్మగారి యింటికి వెళ్ళిందేమో అనుకుని 'ఇందిరా!' అని పిలుస్తూ వాళ్ళ యింటి తలుపు తీశారు గురువుగారు. చంపక వచ్చి, "ఇందిర కనబడలేదా?" అంటూ తలుపు వెనుక ఏదో గమనించి, వచ్చిన నవ్వు ఆపుకుంటూ అటు చూడమన్నట్లు గురువుగారికి సైగ చేసింది. గురువుగారు తలుపు వెనుక చూసి ఒక్కసారి పెల్లుబికిన ఆనందాశ్చర్యాలతో ప్రాన్పడిపోయారు.

నల్లనివాడు పద్మనయనంబులవాడు కృపారసమ్ము పై
జల్లెడివాడు, మౌళి పరిస్ఫురిత ఫించమువాడు, చేతిలో
పిల్లనగ్రోవి వాడు, మురిపించెడి ముద్దుల మోమువాడునై
యల్లరి పిల్లవాడొకడటన్ గనిపించెను కన్ను గీటుచున్॥

ఆ కనుగీటుతోనే తనువూ మనసూ మరచిన గురువుగారు "కృష్ణా!" అంటూ రెండు చేతులూ ముందుకుచాచారు. 'అదేమిటక్కయ్యా నన్ను చూసి కృష్ణా అంటావేమిటి?' అన్న ఇందిర గొంతు తలుపు వెనుకనుంచి వినిపించింది. అంతలోనే, రెండో తలుపు వెనుక నుంచి "ఆమెకు యిప్పుడు ఎవరిని చూసినా కృష్ణుడే కనిపిస్తున్నాడులే" అన్న శ్రీబాబు గొంతు వినిపించింది. గురువుగారు అటు తిరిగి చూసేసరికి, అక్కడ

త్రిజగన్మోహన నీలకాంతి తనువుద్దీపింప, ప్రాభాతనీ
రజబంధు ప్రభమైన చేలము పయిన్ రంజల్ల, నీలాలక
వ్రజ సంయుక్త ముఖారవిందమతి సేవ్యంబై విజృంభింప సం
గజ సౌందర్యము గేలి కొట్టి నిలిచెన్ కౌమార కృష్ణుండటన్ ॥

అలా ఒక ప్రక్క ఇందిర, మరో ప్రక్క శ్రీబాబు యిద్దరూ శ్రీకృష్ణుని రూపంలో దర్శనమిచ్చేసరికి, గురువుగారు పరవశులైపోయి

అరయన్ శంతను పుత్రుపై, విదురుపై, నక్రూరుపై, కుబ్జపై
నరుపై, ద్రౌపదిపై, కుచేలుని పైయిన్, నంద వ్రజ శ్రేణిపై
పరగన్ గల్గు భవత్కృపారసము నాపై కొంత రానిమ్ము, నీ
చరణాబ్జంబుల నమ్మికొంటి జగదీశా! కృష్ణా! భక్త ప్రియా! ॥

అని పాడుతూ ఆనంద బాష్పాలు కారుస్తూ ఉండిపోయారు. కొంతసేపటికి యిందిర మామూలుగా కనిపించింది. శ్రీబాబు కనబడలేదు. గురువుగారు వెళ్ళి చూస్తే, వారు తమ గదిలోనే ధ్యానంలో ఉన్నారు.

-సశేషం

విష్ణు  కథలు

-రమణ ప్రసాద్

## 8. సదాశివ బ్రహ్మేంద్ర సరస్వతి

"ఓ మహాదేవా! నీ వైభవం మనస్సుకు అతీతమైనది. సర్వాంతర్యామివి అయిన నిన్ను ఎక్కడ పూజించాలి? ఏ ఆసనం నీకు సమకూర్చేది? నీ కరచరణాలు సర్వత్రా వ్యాపించి ఉండగా నీకు అర్ఘ్యపాద్యములెలా సమర్పించేది? శుద్ధ స్వరూపమైన నీకు స్నానమెలా చేయించేది? ఆకాశమే ఆచ్ఛాదంగా ధరించిన నీకు ఏ వస్త్రాన్ని చుట్టేది? నాగాభరణుడవైన నీకు ఏ ఆభరణం అలంకరించ గలను? స్వప్రకాశకుడవైన నీకు సమర్పించే నీరాజనం ఏది? నీ శిరస్సు ఊర్ధ్వలోకాల నధిగమించి ఉంది. నీకు ఛత్రం ఎలా పట్టేది? నటరాజసుందరా! నీ ఎదుట నేను నాట్యం చేయగలనా? సామగాన లోలుడవైన నీ సన్నిధిలో నేను పాట పాడగలనా? వాక్కుకి అందని నిన్ను ఏమని ప్రార్థించేది? హే! జగదీశ్వరా! నీ ఆత్మలో నేను లయించి ఆనందించేలా ఆశీర్వదించు" అని కీర్తించాడు.



శివరాముని ప్రార్థన సదాశివుని కదిలించింది. భగవదనుగ్రహంతో అతనికి గురుసాన్నిధ్యం లభించింది. కామకోటి పీఠశంకరాచార్యులైన సదాశివేంద్ర సరస్వతీ స్వాముల వారి చరణాలను ఆశ్రయించారు. పరమశివేంద్ర స్వాముల వారు శోత్రియ బ్రహ్మనిష్ఠులు. శివరామునిలో భాసించే చైతన్య దీపికను దర్శించి"సదాశివా!" అని పిలిచారు. గురు శుశ్రూష చేస్తూ కఠిన సాధనను ఆచరించారు. సదాశివ బ్రహ్మేంద్రులు శ్రావ్యమైన కీర్తనలు రచించారు. తర్కశాస్త్ర పండితుడై ఎందరో పండితులను ఓడించాడు. వ్యాస భగవానుని బ్రహ్మసూత్రాలకు పతంజలి మహర్షి యోగాసూత్రాలకు భాష్యం రచించారు. "భాష్య విలాసము" అనే 65శ్లోకాల గ్రంథం వ్రాశారు. తన రచనలనన్నిటినీ తన గురు చరణాలకే అంకితం చేశారు. గురుమహిమ వర్ణనాతీతము అని శ్లాఘించారు. తాను వ్రాసిన కీర్తనలలో చివరన "పరమహంస గురు"

అని గురునామాన్ని కీర్తిస్తూ గానం చేశారు.

గురువుగారి వద్దకు వచ్చే పండితులతో సందర్భానుసారంగా వాదించేవాడు. సదాశివుని సునిశిత విజ్ఞానానికి పండితులు నిలువలేక పోయేవారు. ఒకనాడు సదాశివునిచే పరాజితుడైన పండితుడు పరమశివేంద్ర గురువుల చెంత చేరి, సదాశివుడు వాచా వేదాంతిగా తయారవుతున్నాడని ఫిర్యాదు చేశాడు. పరమశివేంద్రులు, సదాశివుని పిలిచి, "సదాశివా!" నీవు మౌనాన్ని పాటించేది ఎప్పుడు?" అని ప్రశ్నించారు. గురుదేవా! మీ ఆజ్ఞ కొరకే కాచి ఉన్నాను ఇప్పటి నుంచే మౌన వ్రతాన్ని పాటిస్తున్నాను." అని గురుపాదాలకు ప్రణమిల్లాడు. ఆనాటి నుంచి తన శరీరాన్ని చాలించే వరకు మాట్లాడలేదు. ఆ క్షణం నుంచి సదాశివుని స్వరపేటిక మూగబోయింది. తనకు తదనంతరం కలిగిన అనుభూతులను తెలియ చేస్తూ కీర్తనలు రచించాడు. తన నిజస్థితిలో తాను నిలుచుటకు కారణము గురుకృపయే అని తెల్పుతూ కీర్తన రచించాడు.

*బ్రహ్మై వాహంకిల సద్గురు కృపయా* // బ్రహ్మై //
*బ్రహ్మై వాహంకిల సద్గురు కృపయా*
*చిన్మయ బోధానంద ఘనం తత్* // బ్రహ్మై //
*శృత్యం తైక నిరూపిత మతులం*
*సత్య సుఖాంబుధి సమరస మనఘమ్* // బ్రహ్మై //
*ఆశాపాశ వినాశన చతురం*
*కోశా పంచకాతీత మనన్తం*
*కారణ మకారణ మేకమనేకం*
*కాలాకాల కలిదోష విహీనమ్* // బ్రహ్మై //

"నేను బ్రహ్మమును. సద్గురు కృపచేత బ్రహ్మము నేనే అయి వున్నాను. సద్గురు మహిమచేత చిత్స్వరూపము, ఉపనిషత్ప్రతిపాదిత శుద్ధానందము, నిష్కళంకము అచలసత్తాసాగరము, అమృతానంద స్వరూపము అయిన బ్రహ్మముగా నేనే అయి ఉన్నాను.

-సశేషం

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL